

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 19 డిసెంబరు 2024

'జికా' కలకలం

- ఆరేళ్ల బాలుడికి వైరస్ లక్షణాలు
- పూణే వైరాలజీ ల్యాబ్‌కు నమూనాల తరలింపు
- వెంకటాపురంలో వైద్య బృందం పర్యటన



మర్రిపాడు/నెల్లూరు (వైద్యం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఓ బాలుడికి జికా వైరస్ సోకినట్టు తెలియడంతో వైద్య ఆరోగ్య శాఖలో కలకలం రేగింది. మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బద్దల నాగరాజు, కళ్యాణిల ఆరేళ్ల కుమారుడు సుబ్బారాయుడు 20 రోజుల క్రితం జ్వరం బారినపడటంతో అన్ని ఆసుపత్రులలో చూపించారు. ఎక్కడా నయం కాకపోవడంతో నెల్లూరులోని నారాయణ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ బాలుడ్ని పరీక్షించిన వైద్యులు జికా వైరస్ అనే అనుమానంతో కొన్ని నమూనాలు తీసి ముంబయిలో ల్యాబ్‌కు పంపారు. అక్కడ జికా వైరస్‌గా నిర్ధారణ అయింది. దీంతో మంగళవారం సుబ్బారాయుడిని మెరుగైన చికిత్స కోసం చెన్నై ఎగ్మోర్‌కు తరలించారు. మరోవైపు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా ఆ బాలుడి నుంచి నమూనాలు తీసి పూణే వైరల్ ల్యాబ్‌కు పంపించారు.

● వెంకటాపురంలో వైద్యాధికారులు

జికా వైరస్ అన్న అనుమానంతో వైద్యాధికారులు వెంకటాపురంలో బుధవారం పర్యటించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథరావు, ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వైలెన్స్ అధికారి డాక్టర్ మౌనిక, జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ, కీటకాల అధ్యయన అధికారి కొండారెడ్డి, ఏఎంవో నారార్జునరావు, మర్రిపాడు వైద్యాధికారి గోపీనాథ్ గ్రామంలో పర్యటించారు. బాలుడి ఇంటి చుట్టూ దోమల నిరారణ చర్యలు చేపట్టారు. చుట్టు పక్కల పరిసరాలను శుభ్రం చేశారు. బాలుడికి ఆ వైరస్ ఎలా సోకింది? తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి జ్వర పీడితుల నుంచి నమూనాలు సేకరించారు. ఆ బాలుడు కృష్ణాపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నట్లు గుర్తించి, అక్కడ పని చేస్తున్న కేరళ రాష్ట్రానికి చెందిన టీచర్లను విచారించారు. మరోవైపు బాలుడికి జికా వైరస్ సోకి ఉండదని, ఒకవేళ సోకి ఉంటే ఇప్పటికే ఎక్కువమందికి వ్యాపించి ఉండేదని వైద్యాధికారులు చెబుతున్నారు.

ఇంకా నిర్ధారణ కాలేదు!

బాలుడికి ప్రైవేట్ వైద్యశాలలో రక్త పరీక్షలు నిర్వహించగా జికా వైరస్ లక్షణాలుగా గుర్తించినట్లు తెలిసింది. బాలుడి నుంచి మేము మరోమారు నమూనాలు సేకరించి తిరుపతి, పూణేలకు పంపాము. అక్కడ నుంచి రిపోర్టులు వచ్చే వరకు నిర్ధారించలేము. బాలుడి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉంది. గ్రామంలో వైరస్‌కు సంబంధించి లక్షణాలు ఏవీ కనిపించలేదు. ఈ వైరస్‌పై వదంతులు నమ్మొద్దు.

- రామనాథరావు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టరు


దోమల నివారణకు స్ప్రే చేయిస్తున్న అధికారులు

● ప్రభావం ఎక్కువే..

అమెరికా, ఆఫ్రికా దేశాలలో ఈ జికా వైరస్ తన ప్రభావం చూపింది. దోమల కారణంగా వ్యాపించే ఈ వైరస్ కేరళ రాష్ట్రంలోనూ దీని ప్రభావం కనిపించింది. వైరస్ కారణంగా మరణాలు సంభవించక పోయినా చిన్నారులలో మెదడుపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అలాగే కంటి చూపు కూడా కోల్పోయే ప్రమాదం ఉంటుంది. పుట్టే బిడ్డలు చిన్నతలతో పాటు కీళ్ల సమస్యలు, కండరాల బలహీనత ఏర్పడుతుంది. వ్యాధిగ్రస్తురాలితో శృంగారం చేయటం వల్ల కూడా ఈ వైరస్ ప్రభావం మగవారికి, రక్తమార్పిడి కారణంగా కూడా ఈ వైరస్ వ్యాపిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వైరస్ డెంగ్యూ లక్షణాలు పోలి ఉండటంతో ఆ వైద్య చికిత్సలు చేయాల్సి ఉంటుందని అంటున్నారు.


వెంకటాపురంలో వివరాలు సేకరిస్తున్న వైద్యబృందం

బాలుడికి మెరుగైన వైద్యం : ఆనం

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : వెంకటాపురం గ్రామంలో జికా వైరస్ లక్షణాలు బయటపడ్డ బాలుడికి వైద్యపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరులో ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు బాలుడ్ని తరలించినట్లు చెప్పారు. అలాగే వెంకటాపురం గ్రామంలో ప్రముఖ వైద్యులతో కూడిన బృందాలతో సర్వే నిర్వహించి పరీక్షలు చేయిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరం చేసినట్లు ఆనం పేర్కొన్నారు.



మీ పనితీరు ఇదేనా!? రోగులకు ఇలాగే సేవలందిస్తారా!?

- జీజీహెచ్ సూపరింటెండెంట్‌పై కలెక్టర్ ఆగ్రహం
- ప్రిన్సిపల్ సెక్రటరీ, డీఎంఈకి ఫిర్యాదు
- అన్ని లోపాలు సరిదిద్ది.. 15 రోజుల్లో మార్పు రావాలి
- అత్యవసర పరికరాలను వెంటనే కొనండి
- వాడీవేడిగా జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశం

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : 'మీ పని తీరు ఇదేనా!? రోగులకు ఇలాగే సేవలందిస్తారా!? మిమ్మల్ని సస్పెండ్ చేస్తే పెన్షన్ కూడా రాదు.' అంటూ నెల్లూరులోని సర్వజన ప్రభుత్వ వైద్యశాల (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దా నాయక్‌పై కలెక్టర్ ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి నిర్వహణ సరిగ్గా లేదంటూ మండిపడ్డారు. వెంటనే క్రమశిక్షణ చర్యల కింద వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి, డీఎంఈలకు ఫిర్యాదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరగ్గా ఆరంభం నుంచే కలెక్టర్ జీజీహెచ్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశ అజెండాలోనూ వివరాలు పూర్తిగా లేవని, అసంపూర్తిగా ఉన్నాయంటూ అసహనం వ్యక్తం చేశారు. జీజీహెచ్‌లో 10 విభాగాలు ఉంటే, వాటికి ఏఏ పరికరాలు అవసరమో స్పష్టత లేదన్నారు. మైక్రోప్లానింగ్‌లో అన్ని లోపాలు సరిదిద్దాలని, ఈ మార్పు 15 రోజుల్లో కనిపించాలని సూచించారు. ఆసుపత్రి హెచ్‌వోడీలు కూడా తమ విభాగానికి ఏమేమి కావాలో వాటిని రాతపూర్వకంగా సూపరింటెండెంట్‌కు తెలియచేయాలని సూచించారు. అత్యవసర వైద్య పరికరాలు, ఇతర అవసరాల కోసం ప్రతిపాదనలు పంపితే వెంటనే కొనుగోలు చేయాలని తెలియచేశారు. కిడ్నీ డయాలసిస్ విభాగంలో దాతలు ఏర్పాటు చేసిన పడకలను

- మిగతా 6లో


సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ ఆనంద్

ఇక లిక్కర్ ప్రీమియర్ స్టోర్లు

● నెల్లూరుకు 1 కేటాయింపు ● దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నూతన ఎక్సైజ్ విధానంలో భాగంగా ఉన్నత స్థాయి రిటైల్ అనుభవాన్ని అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రీమియర్ లిక్కర్ స్టోర్ల ఏర్పాటుకు అనుమతిచ్చింది. విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, కడప, అనంతపురంతోపాటు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రీమియం స్టోర్లు ఏర్పాటు చేసుకునేందుకు ఆమోదం తెలిపింది. ఈ స్టోర్ లైసెన్సు వ్యవధి ఐదేళ్లు. రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ మొదటి సంవత్సరం లైసెన్సుదారులు చెల్లించాల్సిన వార్షిక పన్ను రూ.కోటి, రెండవ సంవత్సరం నుంచి 10 శాతం పెరుగుతుంది. ప్రీమియం స్టోర్ కనీస కార్పెట్ వైశాల్యం 4వేల చదరపు అడుగులు. ప్రీమియం స్టోరులో మద్యం, సిగరెట్లు, మద్యానికి సంబంధించిన ఉపకరణాలు, శీతల పానీయాలను, మద్యపానం అనుమతించకూడదు. https://apsbcl.ap.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్లోడ్ చేసుకోవచ్చు. దరఖాస్తు పత్రాలను ఈ నెల 31 సాయంత్రం 5గంటలకల్లా జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో అందించాల్సి ఉంటుంది.

'నవ్విపోదురుగాక మాకేంటి..' అన్నట్టుగా మారిపోయింది రాష్ట్ర మైనింగ్ శాఖ. కోరుకున్న వ్యక్తులకు వందల కోట్ల క్వార్ట్జ్ సంపదను దోచిపెట్టడానికి మొదలైన ఆటలో అధికారులు తొలిపావు కదిపారు. ఇక్కడున్న మైనింగ్ డీడీని బలవంతంగా బదిలీ చేసి ఎక్కడో తిరుపతిలో పనిచేసే ఏడీ స్థాయి అధికారిని తెచ్చి డీడీ కుర్చీలో కూర్చోబెడుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

గనుల కోసం 'ఘనుల' ఆరాటం!



'మైనింగ్'లో కోరుకున్నవారినే తెచ్చుకున్నారు!

నిబంధనలకు అతీతంగా ఏడీకి డీడీ పోస్టు

మైన్స్ డీడీగా తిరుపతి ఏడీ బాలాజీ నాయక్

రాష్ట్ర కార్యాలయానికి నెల్లూరు డీడీ బదిలీ

నెల్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా పరిధిలో క్వార్ట్జ్ గనులను గంపగుత్తగా కొల్లకొట్టడానికి జరిగిన ప్రయత్నానికి సహకరించని నేరానికి డీడీ చంద్రశేఖర్‌ను ఎలా బదిలీ చేశారో, ఎందుకు బదిలీ చేశారో పాఠకులకు గుర్తుండే ఉంటుంది. నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌కు చెందినవిగా చెప్పుకునే నాలుగు క్వార్ట్జ్ గనులకు అనుమతి ఇవ్వడానికి డీడీ చంద్రశేఖర్ అభ్యంతరం తెలిపారు. ఆ గనులను తనిఖీ చేశాకే లీజు రెన్యూవల్‌కు అనుమతి ఇస్తానని చెప్పారు. దీంతో డీడీ జిల్లా కేంద్రంలో లేనిరోజు, విధుల్లో భాగంగా హైకోర్టులో ఒక కేసుకు హాజరైన రోజు రాష్ట్ర మైనింగ్ కార్యాలయంలోని ఒక ఉన్నతాధికారి డీడీ తంబ్‌ను తొలగించి మైనింగ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ద్వారా ఫైల్ అప్రూవల్ చేయడమే కాకుండా కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చి డీడీని రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేసిన విషయం 'రూప్ మాయలు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. చంద్రశేఖర్ స్థానంలో తమకు అనుకూలుడైన బాలాజీ నాయక్ అనే అధికారిని తెచ్చుకోవడానికి రంగం సిద్ధం అయ్యిందన్న విషయాన్ని కూడా ఆంధ్రజ్యోతి ప్రచురించింది. వారం రోజుల వ్యవధిలో అదే నిజమయింది. తిరుపతి మైనింగ్ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న బాలాజీ నాయక్‌ను నెల్లూరు డీడీగా పూర్తి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.


● ఏడీకి డీడీ కుర్చీ

డీడీ పోస్టుకు ఇన్‌చార్జిని నియమించే క్రమంలో సాధారణంగా ఆ హోదా కలిగిన వారికే అదనపు బాధ్యతలు ఇస్తారు. ఈ కోణంలో చూస్తే ఒంగోలు డీడీకి ఇన్‌చార్జి ఇచ్చి ఉండవచ్చు. పోనీ అలా ఇవ్వలేదు, ఏడీ స్థాయి అధికారికి డీడీగా అదనపు బాధ్యతలు అప్పగించారే అనుకున్నా నెల్లూరుకు సమీపంలో ఉన్నవారికి బాధ్యతలు అప్పగించాలి. ఆ కోణంలో చూస్తే గూడూరు ఏడీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. అలా కాకుండా తిరుపతిలో ఏడీగా పనిచేస్తున్న అధికారిని నెల్లూరు డీడీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం విడ్డూరంగా ఉందని ఉద్యోగ వర్గాలు అంటున్నాయి. నెల్లూరు జిల్లాలో క్వార్ట్జ్ కొల్లగొట్టిన గత ప్రభుత్వ పెద్దలను ఛీదరించుకున్న ప్రజలు ఇప్పుడు జరుగుతున్న తతంగాన్నంతా చూసి ఇప్పటి పాలకుల పట్ల అదే తీరుగా స్పందిస్తున్నారు. విచ్చలవిడి అరాచకాలు, అవినీతికి చంద్రబాబు ప్రభుత్వంలో అవకాశం ఉండదన్నది ప్రజల విశ్వాసం. కానీ క్వార్ట్జ్ గనుల కేంద్రంగా ప్రస్తుతం జరుగుతున్న వ్యవహారం గమనిస్తున్న ప్రజలు ఇది చంద్రబాబు పాలనేనా!? అనే మీ మాంసలో పడ్డారు. మరోవైపు తన బదిలీని చాలెంజ్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించి బదిలీ ఉత్తర్వులను రద్దు చేయించుకొచ్చిన చంద్రశేఖర్‌కు నాలుగు రోజులు తిరగకముందే మరోసారి బదిలీ ఉత్తర్వులు చేతికందడంతో ఖంగుతిన్నారు. కోర్టు ధిక్కరణ సెక్షన్ కింద మరోసారి హైకోర్టును ఆశ్రయించనున్నట్లు సమాచారం. నెల్లూరు మైనింగ్ వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందో వేచిచూడాల్సిందే.

'బెకామ్' ప్రయత్నాలన్నీ విఫలమే!

- 'రాళ్లపాడు'లో పైకి రానంటున్న గేటు
- షట్టరు పగలగొట్టేందుకూ విశ్వప్రయత్నం
- నీటి ఉధృతి కారణంగా నిరాశే!
- నేటి నుంచి మోటార్ల ద్వారా నీటి విడుదల

- వివరాలు 6లో..


తూము కుడి కాలువ గేటును పైకి లాగేందుకు ప్రయత్నిస్తున్న బెకామ్ సంస్థ ప్రతినిధులు

నేటి నుంచి ఆర్టీసీ సిటీ సర్వీస్

● అయ్యప్పగుడి నుంచి చిన్నచెరుకూరు వరకు బస్సు



నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగర వాసుల చిరకాల కోరిక నెరవేరబోతోంది. ప్రైవేటు సిటీ బస్సులు, ఆటోవాలాల హవా ఎక్కువయ్యిందని, ఆర్టీసీ సిటీ బస్సులు నడపాలని ఏళ్ల తరబడి ప్రజలు అధికారులను కోరుతూనే ఉన్నారు. చాన్నాళ్లకు ప్రజల వినతిపై స్పందించి ప్రయోగాత్మకంగా నెల్లూరు-2 డిపో ఆధ్వర్యంలో అయ్యప్పగుడి నుంచి చిన్నచెరుకూరు వరకు ఆర్టీసీ బస్సును గురువారం ప్రారంభించనున్నారు. ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి అయ్యప్పగుడి, అయ్యప్పగుడి నుంచి ఆర్టీసీ, మద్రాసు బస్టాండు, గాంధీబొమ్మ మీదుగా ఆత్మకూరు బస్టాండు, పెద్దచెరుకూరు, నరుకూరు, చిన్నచెరుకూరు వరకు బస్సు సర్వీసు నడపనున్నారు. తిరుగు ప్రయాణంలో చిన్నచెరుకూరు, నరుకూరు, పెద్దచెరుకూరు, ఆత్మకూరు బస్టాండు, ఆర్టీసీ బస్టాండు వరకు బస్సు నడుస్తుంది. ప్రస్తుతానికి ఒక బస్సు మాత్రమే నడుస్తున్న ప్రయాణికుల ఆదరణను బట్టి మరిన్ని సర్వీసులు పెంచే అవకాశం ఉంది. కాగా, ఇప్పటికే గూడూరు వైపు వెళ్లే పల్లెవెలుగు బస్సుల్లో ఆర్టీసీ నుంచి అయ్యప్పగుడి వద్దకు స్టాపింగ్ ఇచ్చారు. ఇందుకు రూ.10 చార్జీ వసూలు చేస్తున్నారు.

చార్జీల వివరాలు (రూ.లలో)

నుంచి	వరకు	చార్జీ
ఆర్టీసీ	అయ్యప్పగుడి	10
అయ్యప్పగుడి	ఆత్మకూరు బస్టాండు	20
అయ్యప్పగుడి	పెద్దచెరుకూరు	20
అయ్యప్పగుడి	నరుకూరు	30
అయ్యపగుడి	చిన్న చెరుకూరు	30

భూసేకరణ.. పరిహారం!

- దగదర్తి విమానాశ్రయానికి ఇవే అడ్డంకి
- రూ.96 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదికలు
- 700 ఎకరాల సేకరణలోనే అడ్డంకులు
- ఇవన్నీ పరిష్కరించుకుంటే జిల్లావాసుల కల నెరవేరినట్టే!

మొన్నటి దాకా విమానాశ్రయంపై ఆశలు వదులుకున్న జిల్లా వాసుల్లో కూటమి ప్రభుత్వం మళ్లీ ఆశలు చిగురించేలా చేస్తోంది. ఇటీవల అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో విమా నాశ్రయం నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. నైట్‌హాల్ట్ విమానాశ్రయానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అయితే, ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూసేకరణ, బాధితులకు నష్టపరిహారం ప్రధాన అడ్డంకిగా మారింది. ఇదివరకే అధికారులు పంపిన ప్రతిపాదనల మేరకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది. అలాగే, భూ సేకరణలో తలెత్తిన వివాదాలను సాధ్యమైనంత వరకు పరిష్కరించుకుంటే పనులు వేగవంతం అయ్యే అవకాశం ఉంటుంది.

కావలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దగదర్తి మండలం దామవరంలో విమానాశ్రయం నిర్మాణానికి 2019, జనవరిలో అప్పటి సీఎంగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. విమానాశ్రయం కోసం 1,379 ఎకరాల భూమి అవసరమని అప్పట్లో గుర్తించగా, రన్‌వే నిర్మాణానికి అవసరమైన 600 ఎకరాలకుపైగా కొనుగోలు చేసి ఎయిర్‌పోర్టు అథారిటీకి అప్పగించారు. రన్‌వే పనులు ప్రారంభిస్తే మిగిలిన భూమిని అప్పగిస్తామని చెప్పడంతో దాని నిర్మాణ బాధ్యతలను ఓ సంస్థకు అప్పగించారు. అయితే ఆ ఏడాదే రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. రెండేళ్లపాటు కాలయాపన చేసిన నాటి వైసీపీ సర్కారు ఆ తర్వాత ప్రకాశం జిల్లా తెట్టు ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని చెప్పటంతో జిల్లావాసుల ఆశలు సన్నగిల్లాయి. అయితే, అక్కడ విమానాశ్రయం నిర్మాణానికి అనుకూలత లేదని దాని నిర్మాణ సంస్థలు తేల్చి చెప్పటంతో ఆ తర్వాత దాని ఊసే లేకుండా పోయింది. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ అధికారంలోకి రావడంతో దామవరం వద్ద విమానాశ్రయం నిర్మాణంపై ఆశలు చిగురిస్తున్నాయి. కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా రాష్ట్రానికి చెందిన రామ్మోహన్ నాయుడు నియమితులుకావడం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా గతంలో తాను శంకుస్థాపన చేసిన దామవరం వద్దనే విమానాశ్రయం నిర్మించాలనే కృతనిశ్చయంతో ఉండటం కలిసొచ్చే అంశం.

● కొలిక్కిరాని భూసేకరణ

2019లో అప్పటి టీడీపీ హయాంలో చేపట్టిన భూసేకరణ కాకుండా ఆ తర్వాత సెంటు భూమి కూడా సేకరించలేదు. విమానశ్రయానికి 1,379 ఎకరాల భూమి అవసరమని అప్పట్లో గుర్తించారు. ఇప్పటికే 600 ఎకరాల వరకు సేకరించి ఎయిర్‌పోర్టు అథారిటీకి అప్పగించారు. ఇంకా 700 ఎకరాల వరకు భూసేకరణ జరిగినా స్వాధీనం చేసుకునేందుకు పరిహారం చెల్లించేందుకు రూ.96 కోట్లు అవసరమని గుర్తించారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కృషి మేరకు రూ.96 కోట్ల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇంకా ఆ నిధులు మంజూరు కాకపోవటంతో వాటి కోసం నిరీక్షిస్తున్నారు. మరోవైపు సేకరించిన భూమిలో అనేక సమస్యలు ఉండటంతో వాటిని అధికారులు పరిష్కరించాల్సి ఉంది. సుమారు 60 ఎకరాల పట్టాభూమికి పరిహారం చెల్లించాల్సి ఉంది. డీకేటీ, సీజేఎఫ్‌కు చెందిన మరో 100 ఎకరాలలో వాటి అనుభవదారులు వద్ద సరైన పత్రాలు లేక పోవటంతో వాటి వారసులను ఎంపిక చేయాల్సి ఉంది. మరో 125 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానికేతరులకు పట్టాలు ఇచ్చారు. దీనిపై స్థానికుల అభ్యంతరం మేరకు చేపట్టిన విచారణలో పట్టదారులు అనర్హులని తేల్చినా ఆ భూములపై అధికారులు ఇంకా నిర్ణయం తీసుకోలేక పోతున్నారు. మరో 400 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక సంస్థ కొనుగోలు చేసి ఉండటంతో ఆ భూమి హక్కులపై కోర్టులో వివాదం నడుస్తోంది. నిధులు మంజూరైన వెంటనే బాధితులకు పరిహారం చెల్లించి వాటిని స్వాధీనం చేసుకునేందుకు అనుకూలత ఉన్నా భూసేకరణలో స్థానిక అధికార యంత్రాంగం పెద్దగా స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి.


విమానాశ్రయ భూములలో 2019లో సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన పైలాన్ ఇదే!

ఎంతో అనుకూలం

జిల్లాలో కృష్ణపట్నం పోర్టు వినియోగంలో ఉండగా రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణం తుదిదశలో ఉన్నాయి. రామాయపట్నం పోర్టుకు అనుసంధానంగా అనేక పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంది. రెండు పోర్టులకు మధ్యలో జాతీయ రహదారిని ఆనుకుని విమానాశ్రయం నిర్మిస్తుండటం అన్ని వర్గాలకు అనుకూలంగా ఉంటుంది. విమానశ్రయం ద్వారా పలు ఉత్పత్తులు ఎగుమతులు, దిగుమతులకు అనువుగా కార్గో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుం టున్నారు. ఇక పరిశ్రమల ప్రతినిధులతో పాటు జిల్లావాసులకు ఈ విమానాశ్రయం ఎంతో అనుకూలంగా ఉంటుంది.



నాడు అలా.. నేడు ఇలా!

కృష్ణపట్నం కాలువకు మోక్షం.. రైతుల్లో ఆనందం

ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం కాలువకు మోక్షం కలిగింది. ఎన్నో ఏళ్ల నుంచి పిచ్చి చెట్లు, తూటాకుతో నిండిపోయి సాగునీరు పారుదల ఉండేదికాదు. దీంతో వేలాది ఎకరాల్లో వరిసాగును సకాలంలో చేసుకోలేక రైతులు ఇబ్బందిపడ్డారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి కాలువ దుస్థితిని తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. సకాలంలో నీరు అందాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే సహకారంతో స్థానిక రైతులే కాలువ మరమ్మతులు చేపట్టారు. మొన్నటిదాకా పూడిపోయి కాలువ రూపే కనిపించని కృష్ణపట్నం కాలువ ఇదిగో ఇలా సాగునీటితో కళకళలాడుతోంది.

- ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి)



పిచ్చి కుక్క రేపుతోంది!


స్థానిక పంచాయతీ పరిధిలోని కొల్లారుపాడు ఎస్సీ కాలనీలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. నాలుగు రోజులుగా గ్రామంలోని ఐదుగురు వ్యక్తులు, 3 మేకలు, 2 బర్రెలపై దాడి చేసి కరుస్తుంది. దీంతో గ్రామస్థులు కర్రలతో తరుముతుంటే గ్రామం పక్కనే ఉన్న తోటల్లోకి వెళుతుంది. ఆదమరిచిన తరువాత రాత్రులు వీధుల్లో సంచరిస్తూ కన్పించిన వాళ్లపై దాడి చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. నిద్ర లేకుండా రాత్రులు కూడా కాపలా కాస్తున్నట్లు ఎస్సీ కాలనీవాసులు చెప్పారు. కాలనీలో కుక్కలు బెడద ఎక్కువగా ఉందని ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి)



ఊరి వరస

మావో.... ఏంది సంగతా..?



- ఓ...మే కోడలా మీ ఆయనుండడా...!
- నీ యవ్వా బుడ్డోడో... గుద్దిననుకో....!
- పల్లెల్లో ఇప్పటికీ అదే 'వరస'
- కుల, మతాలకు అతీతంగా పలకరింపు

నెల్లూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుల, మతాల మధ్య ఐక్యత మానవ సంబంధాలకు ప్రతీక, వీటిని ఇప్పటికీ మనం చూడాలంటే పల్లెలకు వెళ్లాల్సిందే. బంధుత్వాలతో పనిలేదు, డబ్బు.. హోదాతో అసలు సంబంధమే ఉండదు. ఇంటి పేర్లతో వరసలను కలుపుకుని పూర్వీకుల నుంచి వస్తున్న ఆప్యాయమైన పలకరింపులనే ఇప్పటి కీ నెల్లూరు రూరల్లోని పడమర పల్లెల్లో అలవాటుగా పిలుచుకుంటున్నారు. అరగజం భూమి కూడా లేని రైతు కూలీ వంద ఎకరాల భూస్వామిని సైతం మావో.. బావో.. అనే వరసతో పిలవడం ఇక్కడ ప్రత్యేకత. అగ్రవర్ణాల వారు వెనుకబడిన తరగతులకు చెందిన వారినీ వరస పెట్టి పిలిచి ఊరి నడిబొడ్డునున్న చావడిపై కూర్చొని ముచ్చట్లాడటం నిత్యం కనిపించే దృశ్యం. తరాలు మారాయి, ఊర్లు పెద్దవయ్యాయి, అక్షరాస్యుల సంఖ్య బాగా పెరిగింది, కూలీల కుటుంబాల్లోనూ ఉద్యోగస్తులొచ్చారు, ప్రపంచ వ్యాప్తంగా పరుగులు తీస్తున్న ఆధునికత పల్లెకూ చేరింది. అయినా 'ఊరి వరస' మాత్రం మారలేదు. పాశ్చాత్య పోకడలతో వావివరసలను మంటకలుపుతు న్న ఈ రోజుల్లోనూ పల్లెటూళ్లలో స్వచ్ఛమైన మనసులతో, అచ్చమైన వరసలతో కూడిన పలకరింపులు కొనసాగుతుండటం బయటి ప్రాంతాల వారి అభినందనలు అందుకుంటోంది.

ఆ గ్రామాల్లో ఇప్పటికీ...

రూరల్ మండలంలోని పొట్టేపాళెం, కొండ్లపూడి, దేవరపాళెం, కొమ్మర పూడి, ములుముడి, ఆమంచర్ల, దొంతాలి, సౌత్‌మోపూరు, కందమూ రు, వెల్లంటి, సజ్జాపురం, గొల్లకందుకూరు గ్రామాల్లో 'ఊరి వరస' పలకరింపులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మావా, బావా, అత్తా, కోడలా, కొడుకా, చిన్నోడా, పెద్దోడా, బుడ్డోడా... అంటూ కులాలు, మతాలకు అతీతంగా ఆప్యా యంగా పలకరించుకుంటున్నారు. వయసులో పెద్దవారిని ఏదైనా విషయం అడగాలంటే 'మావో.... ఏంది సంగతా.....?' అని పలకరింపుగా మొదలు పెడతారు. అలాగే ఆడవాళ్లు తమకంటే వయసులో చిన్నవాళ్లయిన మహిళలను పిలిచేటప్పుడు 'ఓ...మే కోడలా... ఎట్టావున్నావు?, మీ ఆయనుండాడా? అని పలకరిస్తుంటారు. పట్టణాలు, బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఈ వరసలు, పలకరింపులు వింతగా ఉంటాయి. ఇదిలా ఉంటే ఈ సంస్కృతి, సంప్రదాయాలతో ఏర్పడిన ఊరి వరు సలు కొన్ని గ్రామాల్లో కుల, మతాలకు అతీతంగా పెళ్లి బంధా లకూ దారితీసిన దాఖలాలూ లేకపోలేదు. మొత్తంగా తరాలు మారినా పల్లెలు మాత్రం ఆదే 'వరస'తో ఉనికిని నిలుపుకోవడం విశేషం.

> పల్లెటూళ్లు దేశానికి పట్టుకొమ్మలు అంటారు. అంతేకాదు, అచ్చమైన మన సంస్కృతి, సంప్రదాయాలకు ఆనవాళ్లు కూడా పల్లెటూళ్లే. మతం ఏదైనా, కులం ఏమైనా చుట్టాల వరసతో పిలుచుకోవడం పల్లె జనాల ప్రత్యేకత. బావా మరదళ్ల సరసం, అత్తా అల్లుళ్ల చతుర్లు, మావా అల్లుళ్ల కొంటెతనం, రచ్చల మీద ముసలోళ్ల పలకరింపులు.... ఇవి పల్లెలకే సొంతం. ఎన్నో తరాల నుంచి వస్తున్న ఈ రకమైన సంబంధ బాంధవ్యాలు, పల కరింపులను నేటి తరం కొన సాగిస్తుండటం విశేషం.

ఊరి ఐక్యమత్యాన్ని తెలియజేస్తుంది



ఊరి వరసతో కూడిన పలకరింపులు ఆ ప్రాంత ఐక్యమత్యాన్ని తెలియజేస్తాయి. ఇది మన పూర్వీకులు తీసుకువచ్చిన అలవాటు. దీనిని ఇప్పటికీ అలాగే కొనసాగించడం సంతోషం. ఈ ఆనవాయితీ భవిష్యత్ తరాలకు కూడా ఇలాగే చేరాలి. ఊరి గుర్తింపునకు కూడా ఇవి ఉపయోగపడుతాయి.

- అన్నం శిరీష, ఉపాధ్యాయురాలు, సౌత్‌మోపూరు

మా ముందు తరం నుంచే...



వరుసతో పిలుచుకోవడం మా ముందు తరం నుంచే వింటున్నాం. అదే అలవాటు మాకూ వచ్చింది. ఎంత పెద్ద భూస్వామైనా సరే వరుసతోనే పిలుస్తాం. వాళ్లూ అలాగే పిలుస్తుంటారు. బయ టూళ్లకు వెళ్లినప్పుడు అక్కడ ఇలాంటి పలకరింపులు లేక మా ఊరి ఉమ్మడితనం తెలుస్తుంది.

- బూదూరు పెంచలయ్య, గొల్లకందుకూరు

అలా పిలిస్తేనే పలుకుతారు



మా ఊళ్లలో కులాన్ని పెద్దగా పట్టించుకోం. మతాలు అంతకంటే లేవు. వరుస పెట్టి పిలవందే పలకరు. చిన్నతనం నుంచే వరుస పెట్టిపిలవడం అలవాటైంది. ఉన్నోళ్లా.. లేనోళ్లా.. అనేది సంబంధం లేదు. అందరం కలిసిపోతాం. వరుసలతో పిలుచు కోవడం అలవాటైపోయింది.

- పల్లవరపు సుబ్రహ్మణ్యం, పాతవెల్లంటి మాజీ సర్పంచ్

పోరుబాటకు ఏడాది

- అమలుకు నోచని వైసీపీ ప్రభుత్వ హామీలు
- కూటమి పాలకులపైనే అంగన్‌వాడీల ఆశలు

ఆత్మకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు నెరవేర్చే వరకు పోరు ఆగదని.. కనీస వేతనం సాధించే వరకు నిరసనలు హోరెత్తుతూనే ఉంటాయని.. నినదిస్తూ గత ఏడాది డిసెంబరులో అంగన్‌వాడీలు ఉద్యమాన్ని కొనసాగించారు. గత డిసెంబరు 12 నుంచి జనవరి 24 వరకు నిరవధిక సమ్మె , ధర్నాలు చేశారు. వైసీపీ మినహా అన్నీ రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలు మద్దతుగా నిలిచాయి. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం వారిని బెదిరించి భయ పెట్టింది. ఉద్యోగాలు తొలిగిస్తామంటూ షోకాజు నోటీసులు ఇచ్చింది. సచివాలయం ఉద్యోగులతో అంగన్‌వాడీల బాధ్యతలను నిర్వహింపచేసేందుకు సిద్ధమైంది. తమ న్యాయమైన కోర్కెలు తీర్చే వరకు ఉద్యమం విరమించబోమని అంగన్‌వాడీలు ఆందోళన కొనసాగించారు. చివరకు అంగన్‌వాడీల చేపట్టిన ఉద్యమం 43వ రోజుకు చేరింది. దాంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఉద్యమ నేతలతో చర్చించి కొన్ని హామీలు ఇచ్చింది. కానీ అవి ఇప్పటికీ నెరవేరలేదు.

అమలుకు నోచని హామీలు

అంగన్‌వాడీల రిటైర్‌మెంట్ వయసు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతామని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 50వేల నుంచి రూ 1.2 లక్షలకు పెంచుతామని, సహాయకులకు రూ. 40 వేల నుంచి రూ. 60 వేల వరకు పెంచుతామని, టీఏ, డీఏలు పెంచుతామని అనాడు వైసీపీ నేతలు హామీ ఇచ్చారు. అయినా ఆ హామీలు అమలుకు నోచుకోలేదు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

అంగన్‌వాడీల ఉద్యమం సందర్భంగా టీడీపీ అధినేతలు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ తదితరులు వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల కోర్కెలను తీరుస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై అంగన్‌వాడీలు ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు, సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు(ఫైల్)

న్యాయం చేస్తారని ఆశిస్తున్నాం



అంగన్‌వాడీలకు వైసీపీ ప్రభుత్వ కొన్ని హామీలు ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. అప్పట్లో టీడీపీ నేతలు అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపి మద్దతుగా నిలిచారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి అంగన్‌వాడీలకు న్యాయం చేస్తారని ఆశగా ఎదురు చూస్తున్నాం.

- పీ రాధ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఆత్మకూరు

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి



అంగన్‌వాడీలకు రూ. 25 వేలు కనీసవేతం చెల్లించాలని, మినీ అంగన్ వాడీలను మెయిన్‌లుగా మార్చాలని, పెన్షన్ అమలు చేయాలని, అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకులు ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశాలు కల్పించా లని తదితర డిమాండ్లతో గత ఏడాది ఉద్యమం కొనసాగించాం. అప్పటి వైసీపీ ప్రభుత్వం కొన్ని హామీలు ఇచ్చినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా వారి సమస్యలు పరిష్కస్తారని ఎదురు చూస్తున్నాం.

- కొండమూరి హజరత్తయ్య, సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి, ఆత్మకూరు

భూసేకరణలో పూర్తి పరిహారం చెల్లించాలి

- కందుకూరు అభివృద్ధి కమిటీ ప్రతినిధుల డిమాండు



మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే దివి శివరాం తదితరులు

కందుకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు, అనుబంధ పరిశ్రమల కోసం జరుగుతున్న భూ సేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని నియోజకవర్గ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాలేటి కోటేశ్వరరావు, నేతి మహేశ్వరరావు, బూసి సురేష్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం కందుకూరు మాజీఎమ్మెల్యే దివి శివరాం నివాసంలో జరిగిన సమావేశంలో వారు పలు సమస్యలపై చర్చించి తీర్మానాలు చేపట్టారు. రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమలకు ఇండోసోల్ కంపెనీకి భూములిచ్చిన రైతులకు పరిహారం సక్రమంగా అందకపోవడంతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల చేవూరులో ఆత్మహత్య చేసుకున్న యువరైతు నక్కల వినోద్‌కుమార్ కుటుంబానికి అన్నిరకాల ప్రయోజనాలు అందేలా చూడాలన్నారు. అలాగే రాళ్లపాడు కుడికాలువ రైతులకు త్వరితగతిన సాగునీరు విడుదల చేయాలని, కందుకూరు బైపాస్ విస్తరణలో భూములు కోల్పోయిన దళితులకు పరిహారం అందించాలన్నారు. ఈ సమస్యపై త్వరలో సబ్ కలెక్టరును కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. సమావేశంలో పొడపాటి శ్రీనివాసులు, తోకల వెంకటేశ్వర్లు, రేణమాల అయ్యన్న, చీతిరాల గోపాల్, చింతరబోయిన నరేష్, సంగా రాము, ముప్పవరపు కిషోర్ పాల్గొన్నారు.

మీ పనితీరు ఇదేనా!?

రోగులకు ఇలాగే సేవలందిస్తారా!?

(5వ పేజీ తరువాయి)

సద్వినియోగం చేసుకుంటూ అవసరమైన వైద్య పరికరాల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ నిధులలో 30 శాతం నిధులు ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిజియోథెరపీ విభాగంలో అవసరమైన పరికరాలు లేనందున అత్యవసర రోగులను వెంకటాచలంలోని కేంద్ర ప్రభుత్వ కాంపొజిట్ రీజనల్ సెంటర్ (సీఆర్‌సీ) సెంటర్‌కు పంపించాలన్నారు. ప్రతి రోగి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలన్నారు. చెత్తలో ఆసుపత్రి వ్యర్థాలు ఉంటే తీసుకెళ్లవద్దని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ముందుగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులను కలెక్టర్ పరిచేయం చేసుకున్నారు. ఈ సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజమన్నార్, అదనపు ప్రిన్సిపాల్ గోవింద్, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, డిప్యూటీ సూపరింటెండెంట్లు నరేంద్ర, మస్తాన్‌బాషా, ఏపీఎంఎస్‌ఐడీసీ ఈఈ విజయభాస్కర్, కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ఎన్నికలు సక్సెస్

- కర్షకులకు మంత్రి ఆనం కృతజ్ఞతలు

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సలహా సంఘాల ఎన్నికలను ఎంతో పాదర్శకంగా, విజయవంతంగా నిర్వ హించినట్లు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం సాగునీటి సలహా సంఘాల ఎన్నికలపై ఇరిగేషన్ అధికారులు, ఆత్మకూరు నియోజకవర్గ సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. రైతులంతా కూటమి ప్రభుత్వానికి మద్దతిచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సాగునీటి సంఘాల సభ్యులతో కలిసి జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పరిశీలిస్తానని చెప్పారు. పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని శ్రేణు లకు సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు దేశ్ నాయక్, ఎంవీ రమణారెడ్డి, బీవీ రమణారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

మనుబోలు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడూరుపాళెం గిరిజన కాలనీలో బుధవారం ఐసీడీఎస్ అధికారులు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ పూజిత, మహిళాపోలీసు సునీత, అంగన్‌వాడీ కార్యకర్త సుబ్బమ్మ, ఆశా వలంటీర్ రమ పాల్గొ న్నారు.

లంచం ఇస్తేనే రుణం మంజూరు?

- వీవోఏని తొలగించాలని 14 పొదుపు గ్రూపు సభ్యుల డిమాండు
- ఫిర్యాదుపై వెలుగు సీసీ విచారణ

ఉలవపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొదుపు, సీఐఎఫ్, స్త్రీ నిధి లోన్లు మంజూరులో ఇబ్బందులకు గురి చేస్తున్న వీవోఏపై సమాఖ్య సంఘం సభ్యులు వెలుగు సీసీ మురళికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సభ్యుల సమక్షంలో విచారణ చేపట్టారు. బాధితులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉలవపాడు పంచాయతీలోని వడ్డెరపాలెంలో వినాయక సమాఖ్య సంఘంలో 18పొదుపు గ్రూపులున్నాయి. ఆ సంఘం వీవోఏ సకాలంలో పొదుపు లోన్లు మంజూరు చేయాలంటే లంచం డిమాండ్ చేస్తారు. లేదంటే కావాలనే లోన్ తీర్మాణాలు తప్పులు తడకగా రాయడం బ్యాంక్ అధికారులు సరి చేసుకుని రావాలని తిప్పి పంపడం పరిపాటిగా మారింది. ఈ విషయంపై వీవోఏని తొలగించాని ఇటీవల మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. విచారించి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కందుకూరు వెలుగు ఏపీ సింహాద్రిని ఆదేశించారు. దీనిలో భాగంగా వెలుగు సీసీ మురళి వడ్డెరపాలెం పొదుపు గ్రూపుల మహిళలతో సమావేశం అయ్యారు.

సభ్యులు చేసిన ఆరోపణలు ఇలా..

- ధనలక్ష్మీ గ్రూపు సీఐఎఫ్ బ్యాంక్ లోన్ కోసం నవంబర్ 27న దరఖాస్తు చేసుకోని తీర్మానాలు, ప్రాసెస్ మొత్తం చేసి తీరా డిసెంబర్ 5న రూ.లక్ష లోన్ మంజూరైయ్యాక మీ ఖా తాలకు పడాలంటే తనకి, సీసీ సారుకు.. సిబ్బందికి లంచం ఇవ్వాలని లేదంటే లోన్ ఆగిపోతుందని బెదిరించారు.
- అనీషా గ్రూప్ సభ్యులతో పాటు సమావేశానికి హాజరైన మిగిలిన పొదుపు గ్రూపు సభ్యులు కూడా వీవోఏ పెట్టిన ఇబ్బం దుల గురించి పూస గుచ్చినట్లు తెలిపారు.
- వీవోఏకి మద్దతుగా సీసీ మాట్లాడు తున్నాడని పొదుపు మహిళలు నిలదీశారు. విచారణను సీసీ తూతూమంత్రంగా జరిపి ముగించారు. వీటిపై స్పందించిన సీసీ మురళి సభ్యులు చేసిన పిర్యాదులను ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.



సమాఖ్య సంఘం సభ్యులను విచారిస్తున్న వెలుగు సీసీ మురళి

వీవోఏ, సీసీకి సంబంధం లేదు

సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరుగుతుందని, సీఐఎఫ్ లోన్ ఆపడానికి వీవోఏకి, సీసీకు ఎలాంటి సం బంధం లేదని తాను స్వయంగా మాట్లాడి సమస్యను పరిష్కారం చేస్తానని, విచారణ నివేదికను బట్టి వీవోఏపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

- కందుకూరు ఏపీ సింహాద్రి

నార్త్‌కొండాయపాళెం సర్పంచు చెక్ పవర్ రద్దు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నార్త్‌కొండాయ పాళెం సర్పంచు కాశె రమణమ్మ చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నట్లు బుధవారం డీపీవో శ్రీధర్‌రెడ్డి నుంచి ఎంపీడీవో కార్యాలయాలనికి ఉత్తర్వులు అందాయి. పంచాయతీ పరిధిలో ముజ్జె లక్ష్మీనారాయణ చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన నిధులను చెల్లించకపోవడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీంతో నిధులు చెల్లించాలని వెలువడిన తీర్పును అనుసరించి ఉన్నతాధికారులు అందించిన ఆదేశాలను సైతం ఆమె పట్టించుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే కేటాయించిన నిధులను ఖర్చు చేయడంలో అలసత్వం ప్రదర్శించడం, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని పంచాయతీ నిధులు డ్రా చేసే అధికారాన్ని మూడునెలల పాటు తాత్కాలికంగా తొలగించి ఆ బాధ్యతను ఈవోపీఆర్డీకి అప్పగిస్తున్నట్లు ఆదేశాలు జారీ అయ్యాయి.

'బెకామ్' ప్రయత్నాలన్నీ విఫలమే!

- 'రాళ్లపాడు'లో పైకి రానంటున్న గేటు

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు తూము కుడి కాలువకు చెందిన స్టాప్‌లాక్ గేటు సమస్య కొలిక్కి రానంటోంది. గేటును పైకి లాగేందుకు 'పోలవరం' బెకామ్ కంపెనీ ప్రతినిధులు బుధవారం చేసిన ప్రయత్నాలన్నీ ఫలించ లేదు. డీఈఈ పరశురాంరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 మంది సభ్యులు గల ప్రతినిధుల బృందం తూము వద్దకు చేరుకొంది. 10 టన్నుల సామర్థ్యం గల రెండు పుల్లీల ద్వారా గేటును పైకి లాగేం దుకు ప్రయత్నించారు. ఎంతసేపటికీ గేటు పైకి రాకపోవడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. అయితే గేటును పగలగొట్టాలనే ఉద్దేశంతో గేటు వద్ద లోపల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకొనేం దుకు ఇద్దరు డ్యాంలోకి దిగి పరిశీలించారు. నీటి ఉధృతి కారణంగా గేటు పగలగొట్టడం సాధ్యం కాదని 'బెకామ్' ప్రతినిధులు తేల్చి చెప్పారు.

మోటార్ల ద్వారా సాగునీరు

రాళ్లపాడు కుడి కాలువ ఆయకట్టు పరిధిలో వరి నారుమడులు, వరినాట్లకు మోటార్ల ద్వారా నీరిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రాజెక్టు డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం గేటు నుంచి 70 క్యూసెక్కుల నీరు మాత్రామే వెళుతోందన్నారు. తూము బావి గోడను కూడా పగులగొట్టి 30, సైఫన్ ద్వారా మరో 10 క్యూసెక్కులు మొత్తం 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు చెప్పారు. ఆయకట్టు పరిధిలో 8500 ఎకరాలలో వరి సాగులో ఉన్నందున 135 క్యూసెక్కుల నీరు అవసరమవుతుందని తెలిపారు. దీంతో మెగా కంపెనీ ద్వారా 50 హెచ్‌పీ, 75 హెచ్‌పీ పంపులను తెప్పించి గురువారం ఉదయం నుంచి కాలువకు నీరు విడుదల చేస్తామని తెలిపారు.

వినండహో..!



క్రిస్మస్ పండగ, సంక్రాంతి సెలవుల నేపథ్యంలో స్వగ్రామాలు, దూర ప్రాంతాలు, విహార యాత్రలు, తీర్థ యాత్రలకు వెళ్లే ప్రజలకు దొంగతనాలపై పోలీసులు వినూత్న రీతిలో అవగాహన కల్పిస్తున్నారు. రెండు రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ఆటోలలో మైక్‌లతో ప్రచారం చేస్తున్నారు. దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. అపార్ట్‌మెంట్లలో దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలం టూ ప్రత్యేకంగా కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. పోలీసులు ఇలా మైకులు ఏర్పాటు చేసుకుని హెచ్చరికలు చేయడం ప్రజలకు కొత్తగా ఉంది.

- నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి)



నెల్లూరు : పొగమంచు తెరలో పెన్నా వంతెన

అబ్బ.. ఏం చలి!

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. దీనికితోడు పగలంతా చల్లని గాలులు వీచడంతో పిల్లలు, వృద్ధులు వణికిపోయారు. చిరువ్యాపారులు, బయట పనులు చేసేవారు, రైతులు, కూలీలు చలికి ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నగరంలో అడపాదడపా వర్షం కురవగా, సముద్ర తీర ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది.

● **నేడు కూడా వర్షం**

అల్పపీడనం మరింత తీవ్రరూపం దాల్చి గురువారం జిల్లాలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం పేర్కొంది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం అయ్యింది.

సంగం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పబ్లిక్ మరుగుదొడ్ల నిర్మాణం రెండేళ్లుగా అసంపూర్తిగా ఉన్నాయి. ఎంపీడీవో, తహసీల్దారు, వెలుగు, డ్వామా, ఎంఈవో, వ్యవసాయ, హౌసింగ్ కార్యాలయాన్నీ ఒకే ఆవరణంలో ఉన్నాయి. వివిధ పనులపై ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అత్యవసరమైతే వాడుకునేందుకు మరుగుదొడ్ల వసతి లేదు. దీంతో రెండేళ్ల కిందట మండల పరిషత్ నిధులు, ఆర్‌డబ్ల్యూఎస్ నిధులతో వీటి నిర్మాణం చేపట్టారు. ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. అధికారులు స్పందించి వెంటనే నిర్మాణాలను పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

మరుగుకు ఇంకా పరుగే..!



కారు, ట్యాంకర్ ఢీ : నలుగురికి గాయాలు

సంగం, డిసెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని పెరమన క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఎదురెదురుగా వస్తున్న కారు, యాష్ ట్యాంకర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలు గురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కథనం మేరకు, నెల్లూరుకి చెందిన వారు కారులో బద్వేల్‌కు వెళ్లి తిరిగి వస్తూ ఉండగా పెరమన క్రాస్ రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న యాష్ ట్యాంకర్‌ను ఢీకొన్నారు. దీంతో యాష్ ట్యాంకర్ సడన్ బ్రేక్ వేయడంతో ట్యాంకర్ రోడ్డుపై బోల్తా పడింది. ఇంజన్ విడిపోయి పొలాల్లో పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారమందుకున్న ఎస్‌ఐ రాజేష్ సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగ్రాతులను 108 వాహనంలో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. ట్యాంకర్‌ను పక్కకు లాగించి వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ఇంజన్ నుంచి విడిపోయి బోల్తా పడిన ట్యాంకర్



ధ్వంసమైన కారు ముందు భాగం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కోవూరు పట్టణానికి చెందిన సునీల్, కిరణ్ సొంత పనుల నిమిత్తం మోటర్‌సైకిల్‌పై మనుబోలులోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో జాతీయ రహదారిపై కాకుటూరు సమీపంలోని మలుపు వద్దకు వచ్చేసరికి వెనుక వస్తున్న వేగంగా తగలడంతో మోటర్‌సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వెంకటాచలం సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడవిలో మూగజీవాల కళేబరాలు

● వన్యప్రాణులవి అంటూ ప్రచారం ● కాదంటున్న అటవీశాఖాధికారులు

ఉదయగిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతంలోని హనుమాన్ నాలా సమీపంలో గల నల్లబండ వద్ద మూగ జీవాల కళేబరాల అవశేషాలను బుధవారం అటువైపుగా వెళ్లిన స్థానికులు గుర్తించారు. రెండు రోజుల క్రితం నల్లబండపై మూగజీ వాలను వధించి మాంసాన్ని తీసుకెళ్లి వాటి కాళ్లు, తలకాయలు, ఇతర శరీర భాగాలు అక్కడే వదిలేసి వెళ్లారు. ఈ వార్త పట్టణంలో దావనంలా వ్యాపించింది. అటవీ రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా దృష్టికి ఈ విషయం వెళ్లడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించాలని సిబ్బందికి ఆయన సూచించారు. దీంతో ఎఫ్‌బీవో లక్ష్మీప్రసన్న, ఏబీవో వెంకటేశ్వర్లు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం కుర్రపల్లి పశువైద్యాధికారి జీ.వినయ్‌ను సైతం ఆ ప్రాంతానికి తీసుకెళ్లి పరీక్షించి శరీర భాగాలను సేకరించారు. అయితే అటవీశాఖ అధికారులు మాత్రం ఆ కళేబరాల అవశేషాలు వన్యప్రాణులవి కాదని, ఇతర జంతువులని తెగేసి చెబుతున్నారు. స్థానికులు మాత్రం వన్యప్రాణులను వధించి మాంసం విక్రయించి కళేబరాల అవశేషాలను అక్కడే వదిలేశారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



జంతు కళేబరాల అవశేషాలను పరిశీలిస్తున్న పశు వైద్యాధికారి, అటవీ శాఖ అధికారులు

అడవి పంది దాడితో రైతు దుర్మరణం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొలంలో కాపలా ఉండేందుకు వెళ్లిన రైతు అడవి పంది దాడికి గురై మృతి చెందాడు.ఈ సంఘటన బుధవారం జీ.కొండారెడ్డి పల్లి లో వెలుగు చూసింది. వివరాల మేరకు, గ్రామానికి చెందిన కుమ్మిత బాలవెంగయ్య(47) వారం క్రితం సమీప పొలాలకు చెందిన కొంతమంది రైతులతో కలిసి వరిపైరుకు కాపలా ఉండేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఓ అడవి పంది అతడిపై దాడి చేయడంతో ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమైంది. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న ఆ రైతు బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



బాలవెంగయ్య మృతదేహం

● **రైలు కిందపడి యువకుడు..**

నెల్లూరు(క్రైం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని యువకుడు రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుమారు 30 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. మృత దేహంపై బ్లూ కలర్ హాఫ్‌హ్యాండ్స్ టీషర్ట్, అదే రంగు నైట్ ప్యాంట్ ఉన్నాయి. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్‌ఐ జీ మాలకొండయ్య మృతదేహాన్ని పరిశీలించి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



యువకుడి మృతదేహం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	110
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	226
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7349
వెండి కిలో ధర	రూ. 91,500
వెండి ఒక గ్రాము	రూ.94.50

ప్రాజెక్టు పనులకు ఆటంకం

● సోమశిలలో నిలిచిన డివైడింగ్ వాల్ నిర్మాణం

● లీకేజీలతో వర్కుల్లో జాప్యం

అనంతసాగరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల ప్రాజెక్టు పరిధిలోని కీలక పనులయిన డివైడింగ్ వాల్ నిర్మాణం ఆలస్యమవుతోంది. దీంతో 11, 12 క్రస్టుగేట్ల ద్వారా నీటి విడుదలకు ఆటంకం ఏర్పడింది. అప్రాన్ నిర్మాణంలో అంతర్భమైన స్లూయిజ్ విభజన- గోడ అత్యంత కీలకం. అయితే ఈ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు భావించారు. డివైడింగ్ వాల్ లేని కారణంగా జరిగే అనర్థాలను అధ్యయనం చేసిన నిపుణులు, ఈపనులను త్వరగా పూర్తి చేయాలని నిర్ణయించారు. ఆదిశగా కొంతకాలంగా ప్రాజెక్టు వద్ద పనులు జరిగాయి.

● సీఎంవోకి ఫిర్యాదుతో...

గతంలో పనులు ఆలస్యం జరిగిన తీరును దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తప్పుపడుతూ అసహనం వ్యక్తం చేశారు. అంతే కాక ఆయన సీఎంవోకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ఆప్రాన్‌తో పాటు, డివైడింగ్ వాల్ నిర్మాణ పనులు వేగం పుంజుకొన్నాయి. రూ 99.11 కోట్ల వ్యయం తో జరుగుతున్న పనులు ఎంత త్వరగా పూర్తయితే అంత మంచిది. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలతో పనుల్లో జాప్యం నెలకొంది. అప్రాన్ పనులకు ఆటంకం లేక పోయినా ఈ పనులు చేయడంలో కొంత అలసత్వం కనిపిస్తుండగా, స్లూయిజ్ ప్రాంతంలో లీకేజీతోపాటు, వర్షపు నీరు వల్ల పనుల్లో పురోగతి కనిపించడం లేదు. దీంతో ఈపనులు ఎప్పటికి పూర్తి చేస్తారా ? అనే ప్రశ్న తలెత్తింది. ఇప్పటికే సోమశిల ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఇక వరదలు వస్తే దిగువకు నీరు వదలడమే తరువాయి. ఈతరుణంలో ఉన్న నిర్మాణాలకు ఇబ్బంది జరగకుండా ఉండాలంటే చేస్తున్న పనులు త్వరగా పూర్తిచేయాల్సిన అవసరం ఉంది.



స్లూయిజ్‌లో డివైడింగ్ వాల్ నిర్మాణ ప్రాంతంలో నిల్వ ఉన్న నీరు



అసంపూర్తిగా అప్రాన్ పనులు

3,140 క్యూసెక్కుల వరద


సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవారం 3,140 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 72.714 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1550, కం డలేరుకు 1,200, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలు వకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.

సాగు సాధ్యమేనా ?

ఉదయగిరి, డిసెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో ఈ ఏడాది వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో గండిపాళెం జలాశయంతోపాటు చెరువుల్లో అరకొరగా నీరు చేరింది. దీంతో ఆయకట్టు భూముల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. రెండేళ్లుగా వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో రైతులు ఆయకట్టు భూముల్లో ఆరుతడి పంటలతోనే సరిపెట్టు కున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో వరి సాగుకు అదును దాటిపో తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వరిపైరు సాగుకు పెట్టుబడులు పెరగడం, మద్దతు ధర లేకపోవడంతో రైతులు పంట సాగుకు పూనుకోవడంలేదు.

● నిండని చెరువులు

నియోజకవర్గంలో అధికంగా వర్షాధారంతోనే పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది వర్షాలు అంతంతమాత్రమే కురిశా యి. ఇటీవల ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన ఓ మోస్తారు వర్షాలకు చెరువులు, జలాశయాల్లో అరకొరగా నీరు చేరింది. 35 అడుగుల నీటి సామర్థ్యం కలి గిన గండిపాళెం జలాశయంలో ప్రస్తుతం 21 అడుగుల మేర నీరుంది. అలాగే నియోజకవర్గంలో ఎనిమిది మండలాల్లో 274 చెరువులు ఉండగా 47,714.6 హెక్టార్ల ఆయకట్టు ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు 20-30 శాతం చెరువులు అలుగు పారగా, కొన్ని చెరువుల్లోకి 50 శాతం మేర నీరు చేరింది. ఈ నీటితో ఆయకట్టు భూముల్లో వరి సాగు కష్టమే అని రైతులు అంటున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురుస్తున్నాయి. ఈ తుఫాన్ ప్రభా వంతోనైనా మోస్తరు వర్షాలు కురిస్తే నీటివనరులు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరు కొని వరి, ఇతరత్రా పంటల సాగుకు వీలుగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.



గండిపాళెం జలాశయంలో అరకొరగా ఉన్న నీరు

● బీళ్లుగా ఆయకట్టు

గండిపాళెం జలాశయం అయకట్టు మూడేళ్ల బీడుగా మారింది. జలాశయం కింద ఆయా మండలాల్లో అధికారికంగా 16 వేల అయకట్టు ఉండగా అనధికారికంగా మరో 5 వేల అయకట్టు కలదు. జలాశయంలో నీరు సమృద్ధిగా ఉంటే ఆయా మండలాల్లో రైతులు వరి సాగు విస్తారంగా చేపట్టేవారు. అయితే తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా మాగాణి భూములు బీడుగా మారాయి.



బీడుగా ఉన్న ఆయకట్టు భూములు

ఆర్‌ఐగా శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖ జిల్లా ఆర్‌ఐగా శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుశాఖలోని మల్టీజోన్ 1, 2 పరిధిలోని ఆర్‌ఐలను బదిలీలు చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా బాపట్లలో ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న డీ శ్రీనివాసరెడ్డి నెల్లూరుకు బదిలీ అయ్యారు.

డిగ్రీ పరీక్షల్లో

ఒకరి డీబార్

వెంకటాచలం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో బుధవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలలో ఒక విద్యార్థి డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు మొత్తం 8,177 మంది విద్యార్థులకు గాను 7,486 మంది హాజరు కాగా మిగిలిన 691 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. నాయుడుపేటలోని శ్రీ వేమా డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి మాస్ కాపీయిం గ్‌కు పాల్పడుతూ పట్టుబడడంతో డీబార్ చేసినట్లు పేర్కొన్నారు.

21న జడ్పీ విద్యార్థులకు

వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని జడ్పీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 21వ తేదీన నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తు న్నట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారుల క్లబ్‌లు వారి సభ్యులకు విద్యార్థుల ద్వారా అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు శుక్రవారం లోపు సమగ్రశిక్ష ఏఎంవో వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి రూ.3వేలు, రూ.2 వేలు, రూ.1500 చొప్పున నగదు బహుమతులు ఇస్తారని తెలిపారు.

గురుకుల విద్యార్థి అదృశ్యం

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని దేవరపాళెం గ్రామంలో ఉన్న ప్రభుత్వ గురుకుల పాఠశాల విద్యార్థి అదృశ్యమయ్యాడు. రూరల్ సీఐ జీ వేణు తెలిపిన వివరాల మేరకు.. కావలి మండలం మదన్నదిన్నెకు చెందిన పత్రా ప్రసాద్, వెంకట రమణమ్మల కుమారుడు శీను దేవరపాళెం గురుకులంలో 9వ తరగతి చదువుతున్నాడు. తన కోసం వెతక వద్దని, రెండేళ్ల తర్వాత తిరిగి వస్తానని మంగళవారం తండ్రికి లేఖ రాసి వెళ్లిపోయాడు. తండ్రి ప్రసాద్ ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పొట్టేపాళెంలో విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. సీఐ వేణు తెలిపిన వివరాల మేరకు... పొట్టేపాళెం వద్దనున్న ఐవోసీ పెట్రోల్ బంకులో నెల్లూరుకు చెందిన భగత్‌సింగ్‌గారి సాయి (32) పనిచేస్తున్నాడు. బంకులో కొలత వేసే ఇనుప కడ్డీతో పక్కనే ఉన్న ఉసిరి చెట్టుకు కాయలు కోసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అక్కడున్న హైటెన్షన్ విద్యుత్ తీగలకు ఇనుప కడ్డీ తగిలింది. దీంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మరణించాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాష్ట్ర ఫెన్సింగ్ పోటీలకు

రేపు ఎంపికలు

నెల్లూరు(విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈనెల 21 నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులకు 20న విజయవాడలోనే నేరుగా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, గురవయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 18 ఏళ్ల వయసు నిండి ఎఫ్ఐఏ గుర్తింపు కార్డు కలిగిన క్రీడాకారులు గూగుల్ షీట్‌లో ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్ కోసం గురువారం సాయంత్రం 5 గంటలకు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడి యంలో హాజరుకావాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులు 20వ తేదీన విజయవాడలో ఎంపికలకు హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు.

కండలేరు నీటిమట్టం

రాపూరు (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 56.6 టీఎంసీలుగా ఉందని డ్యామ్ ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో 1600 క్యూసెక్కులు కాగా, వివిధ కాలువల ద్వారా 1095 క్యూసెక్కుల నీటిని వదలుతున్నామని ఆయన తెలిపారు.

రేపు గీతా చాలీసా పారాయణం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గీతా వైభవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం 2వేల మంది విద్యార్థులతో గీతా చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు ఆ ట్రస్ట్ అధ్యక్షుడు నజీర్‌బాషా తెలిపారు. నెల్లూరులోని ఆయన స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సుజాతమ్మ కాలనీ అష్టలక్ష్మీ ఆలయంలోని రాధాకృష్ణ మందిరంలో ఉదయం 9గంటల నుంచి ఈ పారాయణం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో నగర సంకీర్తన నిర్వహిస్తామని, ప్రజలంతా తరలిరావాలన్నారు.

వ్యాధిగ్రస్థుల, వైద్యసేవలపై సర్వే



సమావేశంలో పాల్గొన్న వైద్య శాఖ జేడీ అనితా పార్థసారథి

● సామాన్యులకు అందనంతగా వైద్య ఖర్చులు

● వినియోగదారుల వివరాల సేకరణలో జాగ్రత్తలు అవసరం

● వైద్య శాఖ జేడీ అనితా పార్థసారథి

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వికసిత భారత్-2047 ప్రచారంలో భాగంగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ అవసరాలకు అనుగుణంగా వయసు వారీగా వ్యాధిగ్రస్థుల ప్రాబల్యం రేటు, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు తదితర అంశాలపై సర్వే చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయ సంయుక్త సంచాలకులు(జేడీ) అనితా పార్థసారథి సూచించారు. బుధవారం నెల్లూరులోని ఓ హోటల్‌లో ఎన్‌ఎస్‌ఎస్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ సామాన్యులకు అందని ద్రాక్షలా వైద్య ఖర్చులు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో కార్పొరేట్ వైద్య సేవల వినియోగం, ప్రసూతి, శిశు జననాల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వినియోగం తదితర వివరాలు నమో దు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్దేశిత గ్రామాలు, పట్టణాలను సందర్శించి వ్యాధిగ్రస్థులు, వైద్య సేవల వివరాలు సేకరించాల న్నారు. వినియోగదారుల వివరాల సేకరణలో తగిన జాగ్రత్తలు తీసుకోవా లని ఆదేశించారు. సర్వే తీరు, విధివిధానాలను ఏడీ గంప శ్రీనివాసరావు వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులు, పలు రకాల వ్యాధులు, లక్షణాలు, వివిధ ప్రభుత్వ వైద్య పథకాల గురించి జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి వివరించారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

'జలకళ' కలేనా?

- పూర్తిస్థాయిలో బోర్లు వేయని గత ప్రభుత్వం
- బిల్లుల బకాయిలతో ఆగిన పథకం

ఓపిక పట్టమంటున్నారు...



జలకళ పథకం ద్వారా 2021 డిసెంబరులో మా భార్య సుజాత పేరుతో బోరు, పంపు సెట్ మంజూరయింది. రెండున్నరేళ్ల క్రితం బోరు వేశారు. సొంతంగా డబ్బులు కట్టి కనెక్షన్ కూడా తీసుకున్నాం. పంపు సెట్ కోసం ఆత్మకూరు పీడీ కార్యాలయానికి పలుమార్లు తిరిగినా ఇంతవరకు ఇవ్వలేదు. అదేమని అడిగితే కాంట్రాక్టరు వద్ద గోదాములో ఉన్నాయి. ఓపిక పట్టు. రేపోమాపో ఇస్తామని చెబుతున్నారు.

- దుద్దుకూరు శేఖర్, రైతు పెగళ్లపాడు, మర్రిపాడు మండలం

మర్రిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు వైఎస్ఆర్ జలకళ పేరుతో బోర్లు వేసి పంపు సెట్లు ఇచ్చి ఆదుకుంటామన్న మాటలు గత వైసీపీ ప్రభుత్వంలో నీటి మూటలయ్యాయి. ఈ పథకంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే మిగిలింది. గత ఐదేళ్లకాలంలో ఆత్మకూరు నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో మూడువేల మంది రైతులు ఈ పథకానికి దరఖాస్తులు చేసుకున్నారు. ప్రారంభంలో ఆర్భాటంగా సర్వేలు చేసి, జియాలజిస్ట్‌ల ద్వారా 1023 బోరు పాయింట్లను గుర్తించారు. 620 మంది రైతుల పొలాల్లో బోర్ల బొక్కలు వేశారు. మిగతా రైతులకు ఎదురుచూపులే మిగిలాయి. బోర్లు వేసిన కాంట్రాక్టరుకు రూ2.70కోట్లు బిల్లులు రావాల్సి ఉంది.దీంతో మరో403 బోరు పాయింట్లు అర్ధంతరంగా ఆగిపోయాయి. మిగిలిన దర ఖాస్తులను మూలన వేశారు. 620పాయింట్లు వేసినా, చేజర్ల మండలంలో ఆరు, ఏఎస్ పేటలో రెండు, మర్రిపాడులో ఒక బోరుకు మాత్రమే మోటార్లు మంజూరయ్యాయి. కానీ వాటిని కూడా రైతులకు అందజేయలేదు. మోటార్లు ఎందుకివ్వలేదని అధికారులను ప్రశ్నిస్తే ప్రభుత్వం కరెంట్ కనెక్షన్లు ఇవ్వటంలేదు. మీరు సొంతంగా కనెక్షన్లు తెచ్చుకుంటే మోటారు ఇస్తామని తెలిపారు.

ఎదురు చూస్తున్నా...



నా భార్య పేరుతో ఉన్న 3.80ఎకరాల భూమిలో జలకళ పథకం ద్వారా మంజూరైన బోరు రెండేళ్ల క్రితం వేశా. అప్పటి నుంచి పంపుసెట్ కోసం ఎదురు చూస్తున్నా. అధికారులను అడిగితే సొంతంగా కరెంట్ కనెక్షన్ తీసుకోవాలన్నారు. అప్లై చేశాను. విద్యుత్ అధికారులు మాత్రం రూ. 20వేలు డీడీ కట్టమంటున్నారు. అది ఎలా కట్టాలో తెలియడం లేదు.

- పిచ్చినాయుడు, తిక్కవరం, మర్రిపాడు

జిల్లాలో రహదారుల అభివృద్ధికి సహకరించండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ వేమిరెడ్డి వినతి

న్యూఢిల్లీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రహదారులను అభివృద్ధి చేయాలని కేంద్ర రవాణా, జాతీయరహదారుల మంత్రి నితిన్‌గడ్కరీకి టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం, మంత్రితో భేటీ అయిన ఎంపీ ఈ మేరకు వినతిపత్రం అందించారు. కావలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. దుత్తలూరు- కావలి రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. రాజుపాలెం నుంచి రామాయపట్నం పోర్టు వరకు రహదారిని అభివృద్ధి చేయాలన్నారు. తన విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, కావలి బైపాస్ రోడ్డుకు సముఖత తెలిపారని, దుత్తలూరు-కావలి రోడ్ల పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎంపీ వేమిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

- ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

కావలి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు.. పెంచిన సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని ప్రజా సంఘాల నేతలు బుధవారం విద్యుత్ శాఖ ఈఈ బెనర్జీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, రాధాకృష్ణయ్య, మణి, నరేంద్ర, కమలాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆప్కాస్‌లో చేర్చాలి

కావలి టౌన్, డిసెంబరు 18: మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు చేసే డైలీ కార్మికులను ఆప్కాస్ పరిధిలోకి చేర్చాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్, పెంచులయ్య, సీఐటీయూ, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి ఆనంను కలిసిన 'గంగపట్నం'

సంగం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పడమటిపాళెం నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన గంగపట్నం చంద్రశేఖరయ్య బుధవారం మంత్రి రామనారాయణరెడ్డిని నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. తనకు రెండోసారి పడమటిపాళెం సంఘం అధ్యక్షుడి అవకాశం కల్పనపై కృతజ్ఞతలు తెలిపారు.

ఎక్సైజ్ పోలీసుల దాడి

కావలి రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):తుమ్మలపెంట పంచాయతీలోని రామచంద్రాపురం బెల్టు దుకాణంపై బుధవారం దాడులు నిర్వహించిట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా మద్యం అమ్మకాలు చేస్తున్న కోడూరు పెదపోలయ్యను అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 15మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనధికార అమ్మకాలు చేస్తున్నట్లయితే సెల్: 94409 02521, 99593 31263 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

స్వెటర్ల పంపిణీ



అనంతసాగరం: దుప్పట్లు అందుకున్న విద్యార్థులు

కావలి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):రుద్రకోట ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు బుధవారం పట్టణానికి చెందిన మోజస్ రత్నాకర్, పింకి దంపతులు స్వెట్టర్లను పంపిణీ చేశారు. కుమారుడు రయన్ లారెన్స్ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామని దాతలు తెలిపారు. హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు సుదర్శనం పాల్గొన్నారు.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలుర వసతిగృహ విద్యార్థులకు నెల్లూరుకు చెందిన దాత కేవీ ప్రసాద్ బుధవారం దుప్పట్లు అందజేశారు. దీంతో విద్యార్థులు దాతకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ శ్రీనివాసులు, గ్రంధపాలకుడు నారాయణరావు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

కందుకూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):స్థానిక జనార్దనస్వామి కల్యాణ మండపంలో బుధవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో 20 మంది సీనియర్ పెన్షనర్లను సత్కరించారు. వారిలో ఇంటూరి మల్లికార్జున, బాలకోటయ్య, పున్నయ్య, సామాను బ్రహ్మయ్య ఉన్నారు. కార్యక్రమంలో ఏటీఓప్రగతి, సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు (ఆర్‌వీ), అధ్యక్షుడు చిమ్మిరి నరసింహ, మాల్యాద్రి, చెన్నయ్య, కృష్ణారావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉత్సహంగా ఫ్రెషర్స్ డే

ఉదయగిరి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో మంగళవారం రాత్రి ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జీ.రామచంద్రరావు, అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి, ఆత్మ పీడీ శివన్నారాయణ, ఏడీఏ చెన్నారెడ్డి, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, అధ్యాపకులు గోపికృష్ణ, రఘునాథ్‌రెడ్డి, సునీత, కిషన్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యలు సరికాదు'

కందుకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన దేశ హోంమంత్రి స్థానంలో ఉండి సాక్షాత్తూ పార్లమెంటులో రాజ్యాంగ రూపశిల్పి డాక్టరు బీఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను తక్షణం మంత్రివర్గం నుంచి డిస్మిస్ చేయాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తన వ్యాఖ్యల ద్వారా హోంమంత్రి అమిత్‌షా తన కులతత్వాన్ని బయటపెట్టుకున్నాడని, దళితుల పట్ల ఆయనకు ఎంత చిన్నచూపు ఉందో నిరూపించుకున్నాడని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



జలదంకి: సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తహసీల్దార్ ప్రమీల

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డీటీ చెంచయ్య అన్నారు. బుధవారం రామాపురం, దక్కనూరు గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఆయన మాట్లాడి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు మహేష్, మనోహర్, నారాయణ, టీడీపీ నాయకులు ఆరికొండ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

- సంగం: తహసీల్దారు సెలవులో ఉండడంతో చెన్నవరపాడు రెవెన్యూ సదస్సులో డీటీ ఆధ్వర్యంలో అధికారులు రైతుల అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజనారాయణ, సర్వేయర్‌లు శివరంజని, సుందర్ పాల్గొన్నారు.
- సీతారామపురం:జయపురంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి అధ్యక్షతన సదస్సులో సమస్యలను పరిష్కరించాలని రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు,సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- ఉదయగిరి: తహసీల్దారు సుభద్ర పుల్లాయపల్లిలో రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటయ్య, వీఆర్వో అనూష, సర్వేయరు రమణ పాల్గొన్నారు.
- దుత్తలూరులో: దుత్తలూరు-1 సచివాలయం పరిధిలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు నాగరాజు రైతుల, నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం లో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- జలదంకి: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జలదంకిలో నిర్వహించిన సదస్సు ను ఆకస్మిక తనిఖీ చేశారు. అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని వేగవంతంగా పరిష్కరించాలని తహసీల్దారు ప్రమీలను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు ప్రమీల, వీఆర్వో గిరి, ఆర్ఐ శ్రీజ, మధురెడ్డి, చిన్నా, మధుసూదన రావు, రఘు తదితరులు పాల్గొన్నారు.
- కొండాపురం: సాయిపేటలో సదస్సులో 11వినతులు వచ్చినట్లు తహసీల్దారు కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దామా మహేశ్వరరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కేంద్ర బృందం ఉపాధి పనుల పరిశీలన



ఉదయగిరి: చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):కాకొల్లువారిపల్లిలో ఉపాధి పనులను బుధవారం జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. ఐఆర్ఎస్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ సశ్చీంద్రకుమార్ పట్నాయక్ ఆధ్వర్యంలోని బృందం భూగర్భ జలాల అభివృద్ధికి రూ.3.29 లక్షలతో చేపట్టిన చెక్‌డ్యాంను పరిశీలించారు. అలాగే సాగులోని జామ తోటలను పరిశీలించి సాగు ఖర్చు, దిగుబడి, ఆదాయం, మార్కెటింగ్ అంశాలను రైతు గడిపూడి మురళిని అడిగి తెలుసుకున్నారు. బృంద సభ్యులు లోకేష్, లక్ష్మీనారాయణ, డ్వామా పీడీ గంగాభవానీ, ఏపీడీ శంకరనారాయణ, ఎపీవో అజంఖాన్, ఈవోపీఆర్డీ నాగూర్‌వలి పాల్గొన్నారు.

- వింజమూరు: ఢిల్లీ నుంచి వచ్చిన సశ్చీంద్రకుమార్ పట్నాయక్ ఆధ్వర్యంలోని జలశక్తి అభియాన్ బృందం మండల పరిషత్ కార్యాలయంలో నిర్మించిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను, అనంతరం వింజమూరు పంచాయతీలో ఉపాధి పనులతో ఏర్పాటు చేసిన హార్టికల్చర్, చాకలికొండలో గ్రామకొలనును సందర్శించారు.

జిల్లా టెలికాం అడ్వైయిజరీ బోర్డు మెంబరుగా గుర్రం మాల్యాద్రి

- అభినందించిన టీడీపీ నేతలు



గుర్రం మాల్యాద్రిని అభినందిస్తున్న టీడీపీ నేతలు

కందుకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా టెలికాం అడ్వయిజరీ బోర్డు మెంబరుగా నియోజకవర్గం నుంచి గుర్రం మాల్యాద్రిని నియమించారు. వలేటివారిపాలెం మండలం నూకవరం మాల్యాద్రికి ఈ మేరకు బుధవారం నియామకపత్రాలు అందాయి. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అధ్యక్షుడిగా ఉన్న కమిటీలో గుర్రం మాల్యాద్రి సభ్యుడిగా ఉంటారు. నేతలు పార్టీ కార్యాలయంలో మాల్యాద్రికి అభినందనలు తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

ఏఎస్ పేట, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని బుధవారం జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం సర్పంచులు,అ ధికారులకు నిర్వహించిన శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసన్నకుమారి,స ర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు

లింగాకర్షక బుట్టలతో ప్రయోజనం

దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూరగాయల సాగులో రైతులు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయడం ప్రయోజకరం అని ఆత్మ పీడీ శివన్నారాయణ సూచించారు. బుధవారం మండలంలో కూరగాయల పంటలను పరిశీలించారు. ఆయన వెంట ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి, వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి, ఏఈవో భోగ్యం సుధీర్‌కుమార్, వీఏఏలు కేశవయ్య, వెంకటపతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎల్‌పురంలో పారిశుధ్య పనులు

బిట్రగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీలోని చెంచులక్ష్మీపురంలో బుధవారం పంచాయతీ అధికారులు, సిబ్బంది పారిశుధ్య కార్మికులతో పారిశుధ్య పనులు చేయించారు. సిబ్బందితో కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు. గత 15రోజులుగా గ్రామంలో దాదాపు 30మందికి పైగా జ్వరాల బారిన పడినట్లు ఉన్నతాధికారుల ఆదేశాలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు ఈవోపీఆర్డీ నయీం తాజ్‌హసాన్ తెలిపారు. వీరివెంట ముంతాల వెంకయ్య, బోగిరి ప్రభాకర్ ఏఎన్ఎంలు ఉన్నారు. అంతర్గత రోడ్లపై వేసిన పేడ దిబ్బలను రైతులకు నోటీ సులు జారీ చేసి తొలగించాలని హెచ్చరించారు.

కబ్జాకు గురైన ఇనాం భూములు ఇప్పించండి



తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న

బిట్రగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్కరాజువారి కండ్రికలోని ఇనాం భూము లను కొందరు కబ్జా చేశారని వాటిని గ్రామస్థులకు ఇప్పించాలని తహసీల్దారు కార్యాల యం ఎదుట బుధవారం బోగోలు మండలం అక్కరాజువారికండ్రి, చెంచులక్ష్మీపురం గ్రామా లకు చెందిన కొందరు ధర్నా చేపట్టారు. తహసీల్దారు సురేష్‌బాబు కార్యాలయానికి రాకపో వడంతో డిప్యూటీ తహసీల్దారు భరత్‌కుమా ర్‌కు వినతిపత్రం అందజేశారు.

జలదంకిలో బైక్ చోరీ

జలదంకి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉత్తరపువీధిలోని బొమ్మారెడ్డి సత్యనారాయణరెడ్డి ద్విచక్ర వాహనం మంగళవారం రాత్రి చోరీకి గురైంది. సత్యనారాయణరెడ్డి ఇంటికి ఎదురుగా ఉన్న గేదెలదొడ్డిలో బైక్‌ను పార్కింగ్ చేసి ఉంచారు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దొంగలు బైక్‌ను తీసుకెళ్లారు. ఉదయం నిద్రలేచి చూడగా బైక్ లేకపోవడంతో అతను కంగారుపడ్డారు. చుట్టుపక్కల ఎక్కడైనా బైక్ ఉందేమోనని వెతికాడు. ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు.

రక్షణ గోడలు లేని వంతెన



మండలంలోని పోలినేనిపాలెంలో తూమలేరుపై నిర్మించిన వంతెనకు రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెనపై ఎదురుఎదురుగా రెండు వాహనాలు వస్తే అదుపుతప్పి వాగులో పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. వానకాలంలో వాగు పొంగే సమయంలో వాహన దారులు వెళ్తే కొట్టుకపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీ



కావలి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

కావలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) స్థానిక విద్యుత్‌శాఖ ఈఈ బెనర్జీ పట్టణంలో విద్యుత్‌శాఖ అధికారులు,సిబ్బందితో కలిసి విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వెంగళరావునగర్‌లోని ఈఈ కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ ఉదయగిరి రోడ్డు మీదుగా ఆర్వోబీ వంతెన వరకు సాగింది. విద్యుత్ పొదుపుతో పాటు సోలార్ విద్యుత్‌పై అవగాహన పెంచుకుని వినియోగంలోకి తెచ్చుకుంటే విద్యుత్ బిల్లుల భారం తగ్గి విద్యుత్‌ను పొదుపు చేసినట్లే అని ఈఈ తెలిపారు. విద్యుత్ పొదుపుపై ప్రజలలో మరింత చైతన్యం తెచ్చేందుకే వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ కావలి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్‌రెడ్డి, కావలి టౌన్, రూరల్ ఏఈలు వసంతరావు, శ్రీనివాసులు రెడ్డి , విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

- ఉలవపాడు: వీరేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు విద్యుత్ వినియోగం, పొదుపుపై అవగాహన కల్పించినట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్ పొదుపు మార్గాలు, విద్యుత్ చౌర్యం నివారణ, సోలార్ ప్యానల్స్, విద్యుత్ ప్రమాణాలు నివారణ తదితర అంశాలపై వివరించారు.

డ్వాక్రా రుణాలే కాదు.. ఇతర రుణాలు ఉన్నాయి

- సద్వినియోగం చేసుకోండి
- ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ శైలేష్‌కుమార్



చెక్కును అందజేస్తున్న శైలేష్‌కుమార్

కందుకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత యువతీ, యువకులు, మహిళలు స్వయం సంవృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు నుంచి బ్యాంకు రుణాలను పొందవచ్చని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ నెట్‌వర్క్ జనరల్ మేనేజరు శైలేష్‌కుమార్ కోరారు. పట్టణంలోని స్వర్ణ ప్యాలెస్ ఫంక్షన్ హాలులో డ్వాక్రా సంఘాల మహిళలకు బుధవారం బ్యాంకు రుణాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాల రుణాలతో పాటు స్వయంసిద్ధ, పీఎంఈజీపీ, స్టాండప్ ఇండియా తదితర పథకాలతో ఇతోధికంగా సబ్సిడీలు, బ్యాంకు రుణాలు అందజేస్తున్నందున ఆయా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కందుకూరు ఎస్బీఐ పరిధిలోని డ్వాక్రా మహిళలకు రూ.15కోట్ల రుణాల చెక్కును అందజేశారు. కందుకూరు ఎస్బీఐ మెయిన్‌బ్రాంచ్ చీఫ్ మేనేజరు శ్రీనివాస్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అమరావతి సర్కిల్ డిప్యూటీ జనరల్ మేనేజరు కృష్ణకుమార్ బి.ప్రభు, రీజనల్ మేనేజరు సూర్యప్రకాష్, రీజనల్ చీఫ్ మేనేజరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధిపై శిక్షణ



సంగం : మాట్లాడుతున్న ఎంపీడీవో షాలెట్

సంగం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సుస్థిరాభివృద్ధిపై బుధవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో షాలెట్, పీఆర్ ఏఈ రామయ్యఏపీఎం రవిశంకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సమగ్రాభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వీవోఆర్డీ ప్రసాద్ ఉన్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో సుస్థిర అభివృద్ధిపై సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణ బుధవారం ముగిసింది. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, ఏపీఎం ఖాజారంతుల్లా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాను పాల్గొన్నారు.
- సీతారామపురం : ఎంపీడీవో భాస్కర్ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికపై రెండోవ రోజు నిర్వహించిన శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించిన పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీని వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భార్గవి, మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

మట్టి రోడ్లకు మహర్దశ

- జేవీ రమణమూర్తి, పంచాయతీరాజ్ ఏఈ (పీఆర్ఐ)



ఉలవపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):మట్టి రోడ్డు లేని గ్రామాలను చూడాలన్నదే లక్ష్యంగా పల్లె పండుగ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని పంచాయతీ రాజ్ ఏఈ (పీఆర్ఐ) జేవీ రమణమూర్తి తెలిపారు. అందులో భాగంగా తొలివిడతలో అన్నిగ్రామాల్లో పనులు చేపట్టామన్నారు.

ఈ వారం ఇంటర్వ్యూ

? సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయా.

! మెటీరియల్, వేజ్‌కాంపోనెంట్ ద్వారా ఉపాధి నిధులు మండలానికి రూ.3కోట్లు మంజూరైయ్యాయి. మండలంలోని అన్ని పంచాయతీలకు జనాభా దమాషా ప్రాతిపదికన నిధులు కేటాయించారు.

? కేటాయించిన నిధులతో ఎన్ని కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు.

! మండలానికి కేటాయించిన నిధులతో 5 కిలోమీటర్ల సిమెంట్ నిర్మాణం చేపట్టాం. నిర్ధేశించిన అన్నిరోడ్లు దాదాపు పూర్తి కావచ్చాయి.

? నిర్మాణలో ప్రమాణాలు పాటిస్తున్నారా

! ఆయా గ్రామాల్లో నిర్మాణంలోని రోడ్డు పనులను సచివాలయం ఇంజనీరింగ్ సిబ్బంది నిత్యం దగ్గరుంచి పర్యవేక్షిస్తుంటారు. క్వాలిటీ, క్వాంటిటీ విషయంలో రాజీపడం. సిమెంట్ రోడ్లు నిర్మాణ అనంతరం క్వాలిటీ కంట్రోల్ విభాగం రోడ్డు నిర్మాణ నాణ్యతను నిర్ధారించిన తరువాతే సంబంధిత బిల్లులు మంజూరు అవుతాయి. కావున కాంట్రాక్టర్లకు ముందుగానే ఇంజనీరింగ్ అధికారులు నిర్ధేశించిన ప్రమాణాల గురించి అవగాహన కల్పించి పనులు చేపట్టేలా సూచిస్తాం.

పదవికి వన్నె తెచ్చిన నేత గ్రంధి యానాదిశెట్టి



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నేతలు

కావలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పదవులు, పార్టీలు ఏవైనా పదవికి వన్నెతెచ్చిన నేత మాజీ మున్సిపల్ ఛైర్మన్ గ్రంధి యానాదిశెట్టి అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కొనియాడారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం గ్రంధి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో స్థానిక బాపూజీ నగర్‌లోని సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు తటవర్తి రమేష్ వర్ధంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సహకారంతో కావలిలో గ్రంధి విగ్రహం ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. అనంతరం అన్నా క్యాంటీన్‌లో గ్రంధి పేరుమీద అన్నదానం చేపట్టారు. మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోట్లూరి శ్రీనివాసులు, తటవర్తి రమేష్, తటవర్తి వాసు, తిరువీది ప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, వెంకట్రావు, బీజేపీ నేత సీవీసీ సత్యం పాల్గొన్నారు.

జనసేనలో మత్స్యకారుల చేరిక

కావలి టౌన్, డిసెంబరు 18: పట్టణంలోని జనసేన కార్యాలయంలో బుధవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో మత్స్యకార సంఘం నాయకులు శ్రీను అధ్యక్షతన తుమ్మలపెంట మత్స్యకారులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుధాకర్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో డాక్టర్ రవి, ఏడుకొండలు, రవికుమార్, దాస్, యానాదిబాబు ఉన్నారు. అనంతరం నీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన పార్టీ అభ్యర్థులు సుధాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.



ఉద్యాన రైతులకు 40-50 శాతం రాయితీలు

● మండల ఉద్యాన అధికారి రెడ్డి ప్రసన్న

ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మంచి రాయితీలను అందిస్తోందని నెల్లూరు రూరల్ ఉద్యాన శాఖ అధికారి కే రెడ్డి ప్రసన్న తెలిపారు. అర్హులైన రైతులు తమ శాఖ నుంచి అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. మరిన్ని విశేషాలు ఆమె మాటల్లోనే....



? ఉద్యాన రైతులకు రాయితీలు నిజమేనా.

! ఉద్యాన రైతులకు ఇప్పట్లో మంచి రాయితీలున్నాయి. ఐదెకరాలలోపు ఉన్న వారికి 50 శాతం, ఆపై ఉన్న వారికి 40 శాతం రాయితీలున్నాయి. ఇవి పంటలకు, పరికరాలకు వర్తిస్తాయి. అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

? నష్టపరిహారాలు, బీమా పైన రైతుల్లో అవగాహన లేమి కనిపిస్తోంది.

! ఉద్యాన పంటల్లో మామిడికి మాత్రమే బీమా సౌకర్యం ఉంది. రూ.2,250 ప్రీమియం చెల్లిస్తే రూ.40 వేల వరకు నష్టపరిహారం అందుతుంది. రైతులు ఎక్కువగా వ్యక్తిగత బీమా సౌకర్యం అడుగుతున్నారు. దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

? రబీ మినహా మిలిగిన సీజన్లో ఉద్యాన సాగు తగ్గుతోంది. ఎందుకని.

! అలా ఏం కాదండీ. చిన్న, మధ్య తరగతి రైతులందరు ఈ-క్రాప్ చేయించుకుంటున్నారు. పెద్ద రైతులు ఈ-క్రాప్‌కు మొగ్గు చూపడం లేదు. అందువల్ల పూర్తి స్థాయి విస్తీర్ణం రికార్డులకు ఎక్కడంలేదు. దీని వల్ల విస్తీర్ణం తక్కువగా కనిపిస్తోంది.

? ప్రత్యామ్నాయ పంటలకు మార్కెటింగ్ లేదన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

! ఉద్యాన తరహా పంటలకు మార్కెటింగ్ ఎప్పుడూ ఉంటుంది. కానీ రైతులు కూలీల కొరత వల్ల సాగుకు సంకోచిస్తున్నారు. చివరగా పంటను అమ్ముకోలేమని తేల్చేస్తున్నారు. ఉద్యాన పంటలను ఎల్లప్పుడు మార్కెట్లో అమ్ముకోవచ్చు.

- నెల్లూరు రూరల్,(ఆంధ్రజ్యోతి)

రెవెన్యూ సదస్సుకు 43 అర్జీలు

మనుబోలు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకుమూడిలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తమ భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 43 మంది రైతులు అర్జీలు ఇచ్చారు. వీటిని ఆన్‌లైన్ చేసి 45 రోజుల్లోగా పరిష్కరిస్తామని మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సదస్సుకు చెరుకుమూడి, కొమ్మలపూడి, ముద్దమూడి గ్రామాల నుంచి రైతులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుబ్బయ్య, ఆర్ఐ. అశ్వత నారాయణ, వీఆర్‌వోలు గుణశేఖర్, మురళీధర్, దేవాదాయశాఖ ఈవో ఉమ, సర్వేయర్ శ్రీనువాసులు పాల్గొన్నారు.

కలుషిత నీటిని ఆపకుంటే

ఫ్యాక్టరీని ముట్టడిస్తాం

● శరత్ హేచరీ యాజమాన్యానికి కోడూరు రైతుల హెచ్చరిక

తోటపల్లిగూడూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పంట కాలువలోకి వదులుతున్న హేచరీ కలుషిత నీటిని నిలుపుదల చేయకుంటే కర్మాగారాన్ని ముట్టడిస్తామని రైతులు హెచ్చరించారు. బుధవారం వారు మహాలక్ష్మీపురంలోని శరత్ హేచరీ కర్మాగారం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ కంపెనీ ద్వారా వచ్చే కలుషిత నీరు పంటకాలువలోకి వదులుతుండడంతో వరి పైరు దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కోడూరు చెరువు 1వ తూము కాలువ కింద సుమారు 330 ఎకరాల్లో వరి సాగుతో పాటు రొయ్యల గుంతలు ఉన్నాయని తెలిపారు. ఆ కాలువలోకి కలుషిత నీటిని వదులుతుండడంతో వరి పైరు దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భగా ఆందోళన చేస్తున్న రైతులతో కంపెనీ యాజమాన్యం చర్చలు జరిపి మూడు రోజుల్లో కంపెనీ నుంచి వచ్చే నీటిని కాలువలోకి రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ షైనబోయిన శ్రీనివాసులురెడ్డి, రైతులు చెరుకూరు రామ్మోహన్, దువ్వూరు జానకిరాంరెడ్డి, వీరబోయిన రమేష్, బైనబోయిన హరి, తదితరులు పాల్గొన్నారు.



హేచరీ యాజమాన్యంతో మాట్లాడుతున్న కోడూరు రైతులు

న్యూస్ బాక్స్

బీటీఏ నేతపై క్రమశిక్షణ చర్యలు

నెల్లూరు(విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బహుజన టీచర్స్ అసోసియేషన్ నగర నాయకుడు షేక్ ఖాజారహంతుల్లాపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు అసోసియేషన్ నగర అధ్యక్షకార్యదర్శులు పెంచల ప్రసాద్, తలారి మల్లికార్జున తెలిపారు. నగరంలోని ఆనకట్టరోడ్డు ఎంసీపీఎస్ పాఠశాలలో బుధవారం ఆ సంఘం నగర సబ్ కమిటీ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ సంఘం నిబంధనలకు విరుద్ధంగా బీటీఏ రాష్ట్ర నేతలను తీవ్ర పదజాలంతో దూషించడాన్ని సబ్ కమిటీ తీవ్రంగా పరిగణించిందన్నారు. దీనిపై ఖాజా రహంతుల్లాను వివరణ కోరగా ఆయన సంఘం ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ లేఖను అందించారన్నారు. దీనిని సబ్ కమిటీ ఆమోదించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి పంపించినట్లు తెలిపారు.

పల్లెపాడులో దంత వైద్య శిబిరం

ఇందుకూరుపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లిపాడులో నారాయణ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానికులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దంత వైద్య డాక్టర్లు ప్రశాంత్, వంశీ, రోషిణి, సునయన, ఉషశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

ముత్తుకూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలని, లేకుంటే చర్యలు తప్పవని మండలం వ్యవసాయ అధికారి జ్యోత్స్నరాణి డీలర్లను హెచ్చరించారు. బుధవారం ఇందుకూరుపేట వ్యవసాయాధికారి రఘునాథరెడ్డితో కలిసి మండలంలోని ఎరువుల షాపులను తనిఖీ చేశారు. నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించారు. రైతు పాస్ పుస్తకంలో ఉన్న విస్తీర్ణం బట్టి బయోమెట్రిక్ ఆధారంగా వేలిముద్ర వేయించుకుని ఎరువులను పంపిణీ చేయాలన్నారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జలదంకిలో బైక్ చోరీ

జలదంకి (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉత్తరపువీధిలోని బొమ్మారెడ్డి సత్యనారాయణరెడ్డి ద్విచక్ర వాహనం మంగళవారం రాత్రి చోరీకి గురైంది. సత్యనారాయణరెడ్డి ఇంటికి ఎదురుగా ఉన్న గేదెలదొడ్డిలో బైక్‌ను పార్కింగ్ చేసి ఉంచారు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దొంగలు బైక్‌ను తీసుకెళ్లారు. ఉదయం నిద్రలేచి చూడగా బైక్ లేకపోవడంతో అతను కంగారుపడ్డారు. చుట్టుపక్కల ఎ క్కడైనా బైక్ ఉందేమోనని వెతికాడు. ఫలితం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు.

కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఫ్యాక్టరీ పరిశీలన

రాపూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొజ్జనపల్లి పంచాయతీలోని కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్-2ని బుధవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ఏపీ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా దినేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పరిశ్రమ ఎలా పనిచేస్తుంది, వెస్ట్ మేనేజ్‌మెంట్ ఎలా జరుగుతుందనే విషయాలపై పరిశ్రమను పరిశీలించామని తెలిపారు. భవిష్యత్తులో బయో మెడికల్ వ్యర్థాల మేనేజ్‌మెంట్ కూడా ఇక్కడ జరిగేలా చూస్తామన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల మాట్లాడుతూ మొదట్లో వెస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు అంటే చెత్తంతా ఇక్కడ పోస్తారేమో అనుకున్నామని, చుట్టుపక్కల గ్రామాల వారు కూడా ఆందోళన చెందేవారని, ఇప్పుడు ఈ పరిశ్రమను పరిశీలించడంతో ఈ ప్రాజెక్టు వారు వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా క్లీన్ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు చెన్ను తిరిపాల్‌రెడ్డి, చెన్నుఅశోక్, దందోలు వెంకటేశ్వర్‌రెడ్డి, కోటినాయుడు, పచ్చిగల రత్నం, తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

జగనన్న లేఔట్లు, ఇళ్ల స్థలాలపై విచారణ

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీలోని కట్టుబడిపాళెం, వవ్వేరు, దామరమడుగు, పురంధరపురం, కాళయకాగొల్లు, తదితర ప్రాంతాల్లో జగనన్న లేఔట్లు, ఇళ్ల స్థలాలను విజిలెన్స్ సీఐ నరసింహారావు, ఇతర అధికారుల బృందంతో కలిసి బుధవారం పరిశీలించారు. తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, వీఆర్వోలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలకు ప్రైవేటు భూములు ఎన్ని ఎకరాలు కొనుగోలు చేశారు, విక్రయించిన రైతులు, మార్కెట్ ధర, కొనుగోలు చేసినదెంత, ఎన్ని ప్లాట్లు వేశారు, ఎన్ని పేదలకు పంచారు తదితర వివరాలపై ఆరా తీశారు. శుక్రవారం మరోసారి వచ్చి పరిశీలిస్తామని చెప్పి వెళ్లిపోయారు. ఈ బృందం ముత్తుకూరు, కొడవలూరు మండలాల్లోనూ పరిశీలించినట్లు తెలిసింది.



స్థానికలతో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

నీటి సంఘాల ఎన్నికల విజేతలకు సత్కారం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో గెలిచిన జనసేన పార్టీ అభ్యర్థులను బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ గెలిచిన వారు నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గునుకుల కిషోర్, కృష్ణారెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు. కాగా, జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరి ష్కార వేదిక జనవాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.



నీటి సంఘాల ఎన్నికల్లో జనసేన తరపున గెలిచిన వారిని సత్కరిస్తున్న మల్లికార్జున యాదవ్ తదితరులు

తలసీమియా చిన్నారులకు

'సంకల్ప' సహకారంతో బోన్‌మ్యారో మార్పిడి

● రూ.25 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు ఖర్చు

● రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు బెంగళూరుకు చెందిన సంకల్ప ఫౌండేషన్ సహకారంతో బోన్‌మ్యారో మార్పిడి శస్త్రచికిత్సలు అందిస్తున్నట్లు రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం నగ రంలోని రెడ్‌క్రాస్ రక్తనిధిలో 17 మంది తలసీమియా చిన్నారులకు బోన్‌మ్యారో మార్పిడి హెచ్‌ఎల్‌ఏ వైద్య పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు 8 మంది చిన్నారులకు ఉచితంగా బోన్‌మ్యారో మార్పిడి చికిత్సలు చేయించామని, మరో 15 మంది చికిత్సకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ చికిత్సకు రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చువుతుందని, ఈ మొత్తాన్ని భరించి చికిత్స చేయిస్తున్నట్లు చెప్పారు. త్వరలో రెడ్‌క్రాస్‌లో 20 పడకలతో తలసీమియా క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకు వస్తున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమం లో రెడ్‌క్రాస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు డాకారపు రవి, నెల్లూరు శాఖ కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, కమిటీ సభ్యులు నేతాజీ సుబ్బారెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్, వాకాటి విజయకుమార్‌రెడ్డి, తలసీమియా విభాగం కన్వీనర్ డాక్టర్ సీత, సలహాదారు డాక్టర్ హరిత తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో కలిసి మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

ప్రతీ భవనం పన్ను పరిధిలోకి రావాలి

● నగర కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని ప్రతీ భవనం, ఖాళీ స్థలం పన్ను పరిధిలోకి రావాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. బుధవారం 3వ డివిజన్ వెంగళరెడ్డి నగర్‌లో ఆయన పర్యటించారు. నూతన భవనాలు, ఖాళీ స్థలాలను పరిశీలించి, వాటికి విధించాల్సిన పన్నులపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడు తూ పన్ను వసూళ్లు డివిజన్ల వారీగా లెక్కకట్టాలని సూచించారు. అనధికార నిర్మాణాలను గుర్తించి తొలుత నోటీసులు జారీ చేసి, ఆపై చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. అనధికార కొళాయిలు, భవనాలు, స్థలాలు ఎక్కడా ఉండకూడదని, ప్రతీదా నికి పన్ను ఉండా లన్నారు. పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందు లు రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవా లని సూచించారు. 37వ డివిజన్ రామ్ నగర్ 3వ వీధిలో రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మించడంపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు రావడంతో దానిని తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. దీంతో పోలీసు భద్రత నడుమ గోడను ప్లానింగ్ అధికారులు తొలగించారు.



నిర్మాణంలో ఉన్న ఇంటికి పన్నుపై ఆరా తీస్తున్న కమిషనర్ సూర్యతేజ

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లో తీసుకోవాలి

● హంస జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విధుల నుంచి తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను తిరిగి వైద్య ఆరోగ్యశాఖ విధుల్లోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని హంస అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు వెల్లడించారు. బుధవారం నగరంలోని హంస కార్యాలయంలో కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ తెలంగాణ హైకోర్టు తీర్పు కారణంగా జిల్లాలో 52 మంది హెల్త్ అసిస్టెంట్లను తొలగించారని చెప్పారు. ఈ పరిణామంతో రాష్ట్రంలో ఇద్దరు హెల్త్ అసిస్టెంట్లు మానసిక వేదనతో మరణించడంతో ఈ విషయా న్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించిందన్నారు. 20 రోజుల్లో హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని, తదుపరి ఉత్తర్వులు అందేవరకు వారిని కొనసాగించాలని ఆదేశించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కమల్ కిరణ్, ఆప్తమాలిక్ అధికారి శశికళ, వరప్రసాద్, ఖాదర్ బాషా, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేజెర్ల సుధాకర్‌రావు

మహావిష్ణు ఆలయంలో ధనుర్మాస పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అయ్యప్ప దేవస్థానంలో ఉన్న శ్రీగురువాయురు మహావిష్ణు స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం తిరుప్పావై, సాయంత్రం గోదాదేవికి అర్చన, ప్రాకారోత్సవం, ఆండాళ్ నీరాటోత్సవం నిర్వహించారు. పీటీ జగన్నాథం, పద్మజ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ అధ్యక్షుడు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, పావళ్ల ప్రసాద్ పర్యవేక్షించారు.

మార్కెట్‌లోకి జేసీబీ-215 విడుదల



మార్కెట్‌లోకి విడుదలైన ఎక్స్‌వేటర్‌తో షోరూమ్ నిర్వాహకులు

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కోవూరులోని గోల్డ్ ఫీల్డ్ షోరూమ్‌లో బుధవారం సరికొత్త జేసీబీ-215 హ్యూయెల్ మాస్టర్ ఎక్స్‌వేటర్ మిషన్‌ను ఘనంగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. షోరూమ్ ఎండీ బీఎల్ కార్తీక్ మాట్లాడుతూ ఈ మిషన్‌ను మైనింగ్, క్వారీ సెగ్మెంట్‌కు అనుకూలంగా డిజైన్ చేశారని, దీనిలో పలు ప్రత్యేకతలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ ఎం జగన్ మాధవన్, ఏరియా మేనేజర్ ఇంద్రజిత్ సింగ్ పాల్గొన్నారు.

మరుపురాని మహానటి సూర్యకాంతం

● శత జయంతి వేడుకలో వక్తలు

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తన సహజమైన నటనతో ప్రేక్షకులను అలరింపచేసి, మంచి వ్యక్తిత్వంతో అందరి మన్ననలు పొందిన సినీనటి సూర్యకాంతం మరుపురాని మహానటి అని హైదరాబాద్‌కు చెందిన సినీ విజ్ఞాన విశారద ఎస్‌వీ రామారావు తెలిపారు. నగరంలోని వర్ధమాన సమాజంలో బుధవారం చేతన సంస్థ సూర్యకాంతం శతజయంతి వేడుక నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన రామారావు మాట్లాడుతూ నటిగా సూర్యకాంతం వాచకం, టీవీ ఆహార్యం అన్నీ గుండమ్మ కథ సినిమాలో చూడవచ్చన్నారు. చలన చిత్రసీమలో ఆమె లేనిలోటు ఎవరూ పూడ్చలేదన్నారు. ఇమామీ ఆగ్రోటెక్ వైస్ ప్రెసిడెంట్ ఎంవీ నారాయణ మూర్తి మాట్లాడుతూ గయ్యాళి పాత్రలు పోషించిన సూర్యకాంతం నిజజీవితంలో ఎంతో సౌమ్యురాలన్నారు. సినీ సంభాషణల రచయిత పీ రాజేంద్ర కుమార్ తన ప్రసంగంలో సూర్యకాంతం నటించిన సినీ పాత్రల విశేషాలు వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌వీ రామారావు నిర్మించిన సూర్య కాంతం లఘుచిత్రం ప్రదర్శన ఆకట్టుకుంది. మహానటి శత జయంతి పురస్కారాన్ని రేబాల లక్ష్మికి ప్రదానం చేశారు. షీ (ఎస్‌హెచ్‌ఈ) లఘుచిత్రానికి ప్రత్యేక జ్యూరీ అవార్డు అందుకున్నందుకు కళాంజలి అనంత్‌ను సన్మానించా రు. ఈ కార్యక్రమంలో లఘుచిత్రం నిర్మాత జమలాపురం రాధాకృష్ణ, చేతన సంస్థ కార్యదర్శి వై శేషగిరీశం, విశ్రాంత ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, పద్యకళా పరిషత్ అధ్యక్షుడు ఎం రామచంద్ర ప్రసాద్, నెల్లూరు రచయితల సంఘం అధ్యక్షుడు ఏ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యకాంతం పురస్కారాన్ని అందుకుంటున్న రేబాల లక్ష్మి

దుక్కి పిండి కొంటేనే యూరియా..!?

● అవసరం లేనిది ఎందుకని రైతుల ఆందోళన

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొంటున్న ఎరువులు, పురుగు మందుల దుకాణ దారులు కొందరు యూరియా కావాలంటే అవసరం ఉన్నా లేకున్నా దుక్కి పిండి కొనుగోలు చేయాలని షరతులు ఎడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో అవసరం లేని దుక్కిపిండి కొనుగోలు చేసి ఏమి చేసుకోవాలని ప్రశ్నిస్తే అది తమకు సంబంధం లేదని, దుక్కిపిండి కొనుగోలు చేయకుంటే యూరియా ఇవ్వమని తెగేసి చెబుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతోన్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

బుచ్చిరెడ్డిపాళెం మండలంలో 4 సొసైటీలు ఉన్నాయి. బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు రూరల్ కో ఆపరేటివ్ సొసైటీ, బుచ్చి సొసైటీ, దామరమడుగు సొసైటీ, రెడ్డిపాళెంలో మరో సొసైటీ ఉన్నా వాటిల్లో యూరియా మాత్రం లేదు. వవ్వేరు కోఆపరేటివ్ సొసైటీలో అడపాదడపా యూరియా వచ్చినా అది ఒక్క రోజులోనే పలుకుబడి కలిగిన రైతులు తీసుకెళుతున్నారని, సామాన్య రైతులకు అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేట్ దుకాణాల యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. గత నవంబరు నుంచే మండలంలో వరి నాటు మొదలవడంతో ఇప్పటికే 70 నుంచి 80 శాతం మంది రైతులు సుమారు 9 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ఆలస్యంగా నారుమళ్లు వేసిన రైతులు మరో వెయ్యి ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నారు. ఈ క్రమంలో వీరికి యూరియా ఎంతో అవసరం ఉంది. దుక్కి పిండి అవసరం లేదు. అయితే ప్రైవేట్ దుకాణాల డీలర్లు యూరియా కావాలంటే దుక్కి పిండి కొనాలని రైతులను వేధిస్తున్నారన్న ఆరోపణ లున్నాయి.

దుక్కి పిండి కొంటేనే యూరియా ఇస్తున్నారు



సాగు చేసిన వరికి ప్రస్తుతం యూరియా ఎంతో అవసరం ఉంది. తక్కువ కాలం వరి పంటకు వేసిన నెలలోపు రెండు దఫాలు యూరియా వేయాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అయితే బుచ్చిలో యూరియా దొరకడం లేదు. దుక్కిపిండి కొంటే యూరియా ఇస్తామని ఆంక్షలు పెడుతున్నారు. దుక్కిపిండి ఇప్పుడు అవసరంలేదు. దీంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

- గంగపట్నం శివకుమార్, రైతు, పెనుబల్లి

చాగణంలో 'పొలం పిలుస్తోంది'

సైదాపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగణం గ్రామంలో బుధవారం మండల వ్యవసాయాధికారిణి హైమావతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మ, మిరప, వరిపైర్ల సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు కందాటి దయాకర్ రెడ్డి, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నరుకూరులో..

తోటపల్లిగూడూరు,(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేడూరు, నరుకూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారిణి వి.శిరీషరాణి ఎరువులు యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి పంటకు ఈనెల 31లోపు బీమా చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో హరిబాబు, వీఏఏ నిరీష, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వెంకటేశ్వరపురం పరిధిలోని వికలాంగుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో వికలాంగులు, వృద్ధులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. క్రిస్మస్ నెల సందర్భంగా స్థానిక పాస్టర్లను సన్మానించారు. సంఘం అధ్యక్షుడు సనావుల్లా, బ్లాక్ బోర్డు మిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ ఎస్ ప్రసాద్, విజయ్, సురేష్, జకావుల్లా తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై దంత వైద్యం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కొండారెడ్డి దంత వైద్యశాల 54వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 31 వరకు ఉచిత కన్సల్టేషన్, ఎక్స్‌రేపై 50 శాతం రాయితీ, చికిత్సలపై 20 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఆ హాస్పిటల్ అధినేత డాక్టర్ దివ్యారెడ్డి తెలిపారు. బుధవారం జర్నలిస్టు భవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. చిల్డ్రన్స్ పార్కు రోడ్డులో అత్యాధునిక పరికరాలతో కొండారెడ్డి దంత వైద్య స్టూడియో ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

మైనార్టీ హక్కులను ప్రభుత్వాలే కాలరాస్తున్నాయి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు


నెల్లూరు(వైద్యం), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మైనార్టీ హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మైనార్టీ హక్కుల దినోత్సవం సందర్భంగా నగరంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. అవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ దేశంలో వివిధ కారణాలతో మైనార్టీలపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. వీటిని అరికట్టాల్సి న ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. మధ్య తరగతి ఉద్యోగ సంఘాల నాయకుడు నగేష్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పాలన సాగిస్తున్నామని చెబుతున్నప్పటికీ దానికి భిన్నంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బీపీ నరసింహా మాట్లాడుతూ దేశంలోని మైనార్టీలందరూ కలిసికట్టుగా హక్కుల ను సాధించుకునే విధంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అవాజ్ జిల్లా కమిటీ సభ్యుడు షేక్ రియాజ్, సయ్యద్ అన్వర్, షేక్ ఫయాజ్, నమీవుల్లా, డీవైఎఫ్ఐ నాయకులు, ప్రజాసంఘాలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షేక్ రషీద్

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

తోటపల్లిగూడూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని విలుకానిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆ పాఠశాల హెచ్ఎం ఓ.స్నేహలత తన సోదరుడు దివంగత ఓబుల జ్యోతిబాబు జ్ఞాపకార్థం క్రీడా దుస్తులు వితరణ చేశారు. ఈ దుస్తులను ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంఈవోలు ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, జయరామ నాయుడులు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు గోపిరెడ్డి పావని, హెచ్ఎం స్నేహలత, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ పీ.చిట్టెమ్మ పాల్గొన్నారు.





ఇక తగ్గాల్సిందే! పుష్పా

శేషాచలమే మా అడ్డా అంటే కుదరదు

● డ్రోన్స్‌తో జల్లెడ



INTERVIEW



టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

జగన్ జమానాలో శేషాచలం అడవులను కొల్లగొట్టిన ఎర్ర దొంగల పనిపట్టేందుకు కూటమి ప్రభుత్వం కఠిన చర్యలకు పూనుకుంది. ఎర్రచందనం దుంగల విచ్చలవిడి దోపిడీకి చెక్ పెట్టాలని నిర్ణయించుకుంది. ఏకంగా గుజరాత్ గోడౌన్లపైనే మన టాస్క్‌ఫోర్స్ మెరుపుదాడి చేసింది. రూ3.5కోట్ల విలువచేసే ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. దీంతో ఎర్ర దొంగల గుండెల్లో దడ మొదలైంది. కూలీల మొదలు బడాల దాకా ఎవరినీ వదిలే ప్రశ్నే లేదని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ హెచ్చరిస్తున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నియంత్రణపై తీసుకుంటున్న చర్యలపై 'ఆంధ్రజ్యోతి'తో ఆయన సంభాషణలోని ముఖ్యాంశాలు.. ఆయన మాటల్లోనే.. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

మన అడవుల్లోనే దొరికే మేలురకం ఎర్ర చందనం కరువు సీమలో కల్పవృక్షం లాంటిది. అందుకే శేషాచలం కొండలను బయో అట్మాస్ఫియర్ అడవులుగా యునెస్కో గుర్తించింది. చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాలలోని శేషాచల అటవీప్రాంతంలో 5.2 లక్షల హెక్టార్లలో ఎర్ర చందనం విస్తరించివుంది. ఎంతో విశిష్ట సుగుణాలు కల్గివుంది కాబట్టే విదేశీ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. అందుకే 'పుష్పరాజ్'ల కన్ను మన కొండలపై పడింది. ఏటా 2వేల టన్నులకు పైగా ఎర్రచందనం దుంగలను 'పుష్పరాజ్'లు గుట్టుచప్పుడు కాకుండా విదేశాలకు తరలించినట్టు అంచనా. దీని విలువ 2వేల కోట్లు.

కాపాడుకుంటాం

ఎర్రచందనం సంపదను పరిరక్షించే దిశగా ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పడింది. శేషాచలం అడవులను తమ అడ్డాలుగా మార్చుకున్నవారి ఆట కట్టిస్తాం. నిఘా పెంచాం. జల్లెడ పడుతాం. కఠినంగా వ్యవహరిస్తాం. అటవీ శాఖతో కలిసి శేషాచలంను కాపాడుకుంటాం. పెద్దఎత్తున దుంగలను స్వాధీనం చేసుకుంటున్నాం. గతంతో పోలిస్తే ఇప్పుడు కూలీల సంఖ్య తగ్గిందనే చెప్పవచ్చు.

నిరంతర కూంబింగ్

కూలీలను అడవుల్లోకి వెళ్ళనివ్వకుండా ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు కట్టుదిట్టం చేశాం. రహదారులలో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నాం. అన్నమయ్య, కడప, తిరుపతి జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతంలో మా బృందాలు నిరంతరం కూంబింగ్ చేస్తున్నాయి. అడవుల్లో బేస్ క్యాంపులు, వాచ్ టవర్లను ఏర్పాటు చేశాం. అక్కడ సిబ్బంది కాపలాగా ఉంటున్నారు.

బడాలను వదలం : ఎర్రచందనం దుంగలతో పాటు బడా దొంగలను కూడా అరెస్టు చేస్తున్నాం. అందులో భాగంగానే రెండు రోజుల క్రితం గుజరాత్‌లోని గోడౌన్లపై దాడిచేసి ముగ్గురు ప్రధాన స్మగ్లర్లను అరెస్టు చేసి తీసుకొచ్చాం. చిన్న కూలీ చిక్కినా మూలాలకు వెళ్లి బడా స్మగ్లర్లను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం.

శాటిలైట్ ఫోన్లు


శేషాచల కొండల్లో మొబైల్ ఫోన్ సిగ్నల్స్ రానిచోట శాటిలైట్ ఫోన్లు, బైనాక్యులర్స్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇటీవల స్మగ్లర్ల జాడను గుర్తించిన మా సిబ్బంది శాటిలైట్ ఫోన్లతోనే అందరికీ సమాచారమిచ్చారు. దీంతో సులభంగా ఆయా ప్రాంతాలకు వెళ్లగలుగుతున్నాం. శాటిలైట్ ఫోన్లు సత్ఫలితాలు వస్తున్నాయి.

ఆధునిక డ్రోన్‌లు వస్తున్నాయ్

అభయారణ్యాన్ని అన్వేషించాలంటే సాధారణ డ్రోన్స్ సరిపోవు. ప్రత్యేకమైన థర్మోస్టాటిస్టిక్ డ్రోన్స్ కావాలి. వాటికి ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు అవసరం. వీటితో అయితేనే చెట్ల కింద ఉండే మనుషులతో పాటు, జంతువుల కదలికలను కూడా గుర్తించవచ్చు. ఇటువంటి మూడు డ్రోన్స్ ప్రధానమైన 3బేస్‌లకు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే అందుబాటులోకి వస్తాయి.



టాస్క్‌ఫోర్స్‌కు సీఎం చంద్రబాబు అభినందనలు



గుజరాత్ గోడౌన్లపై మెరుపుదాడి చేసి రూ3.5కోట్ల విలువచేసే ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసిన తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులను సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం తన 'ఎక్స్' వేదికగా ఇలా అభినందించారు.

"మన రాష్ట్రంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తాం. మన సహజ వనరులను దోపిడీ చేయడానికి ప్రయత్నించేవారు తీవ్ర పరిణామాలను ఎదుర్కొంటారు. ఈ అక్రమ కార్యకలాపాలను అరికట్టడంలో తిరుపతి రెడ్ సాండర్స్ టాస్క్‌ఫోర్స్ శ్రద్ధతో కృషిచేసినందుకు అభినందిస్తున్నా"



ప్రగతి అంటే ఇదీ!



27 ఏప్రిల్ 2016

శ్రీసిటీ సెజ్‌లో ఇసుజు కర్మాగారాన్ని ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రారంభించారు. వాహనాల ఉత్పత్తి మొదలైంది.



శ్రీసిటీలోని ఇసుజు ప్లాంట్



18 డిసెంబరు 2024

శ్రీసిటీలో ఉత్పత్తి చేసిన ఇసుజు లక్షవ వాహనాన్ని సగర్వంగా సంస్థ విడుదల చేసింది.

తొలి వాహనం తయారీకి ఇసుజు పూనుకున్నపుడు సీఎంగా ఉన్న చంద్రబాబే.. లక్షవ వాహనం ఉత్పత్తి సమయంలోనూ తిరిగి అదే స్థానంలో ఉండడం విశేషం. వస్తు రవాణాకు విశేషంగా ఉపయోగపడే వాహనాలను శ్రీసిటీలో 107 ఎకరాల విస్తీర్ణంలో ఈ పరిశ్రమ ఏర్పాటైంది. 1600 మంది ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. డి-మాక్స్ ఎంయు-ఎక్స్ ఎస్‌యూవీలను ఇసుజు మోటర్స్ ఇండియా పరిశ్రమ ఉత్పత్తి చేస్తోంది. పలు దేశాలకు వీటిని ఎగుమతి చేస్తోంది. ఇప్పటికే లక్ష వాహనాలు ఈ పరిశ్రమలో తయారయ్యాయి. బుధవారం లక్షవ వాహనాన్ని ప్రారంభించే కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి యువరాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ జపనీస్ కంపెనీ గ్రూప్ చైర్మన్ సాడో గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పరిశ్రమల శాఖ మంత్రి టీడీ భరత్ అభినందన సందేశాలను యువరాజ్ వినిపించారు. ఇసుజు ఇంజనీరింగ్ బిజినెస్ సెంటర్ ఇండియా చైర్మన్ సుకామోటో ఐఎంఐ వృద్ధి ప్రయాణాన్ని వివరించారు. ఇసుజు మోటర్స్ ప్రెసిడెంట్ సీఈవో షిన్సుకే మినామి, మిత్సుబిషి కార్పొరేషన్ మొబిలిటీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ అండ్ గ్రూప్ సీఈవో షిగేరు వాకబయాషీ వర్చువల్ విధానంలో ఇసుజు టీంను అభినందించారు.

- వరదయ్యపాళెం, ఆంధ్రజ్యోతి

ఇసుజు సంస్థ నాణ్యత, నిబద్ధతకు ఇది నిదర్శనం. నైపుణ్యం కలిగిన మానవ శక్తి, అధునాతన సాంకేతికత, అత్యుత్తమ పనివిధానాల ద్వారా దీనిని సాధించాం. సంస్థలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డిప్లొమా హోల్డర్ల ప్రతిభ గొప్పది. శ్రీసిటీ సహకారం ఎనలేనిది.

- ఐఎంఐ అధ్యక్షుడు, ఎండీ రాజేష్ మిట్టల్

దేశీయ తయారీ నైపుణ్యం, ప్రపంచ పోటీతత్వానికి సాక్ష్యం ఇది. ప్రపంచ స్థాయి పరిశ్రమలను ఆకర్షిస్తూ నూతన ఆవిష్కరణలు, ఉద్యోగ కల్పన, వృద్ధి సాధన దిశగా మంచి పర్యావరణ వ్యవస్థను నిర్మించడంతో ఆంధ్రప్రదేశ్ అంకితభావంతో ఉంది. స్థానిక ప్రతిభను ఇసుజు ప్రోత్సహించడం గ్రేట్. వెనుకబడిన ప్రాంతంలో పారిశ్రామిక నగరాన్ని ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి అభినందనలు.

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి యువరాజ్

ప్రపంచస్థాయి పారిశ్రామిక హబ్‌గా శ్రీసిటీ పాత్ర గర్వకారణంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్న మొదటి ఆటోమొబైల్ తయారీదారు ఇసుజు. ఇసుజు విజయం శ్రీసిటీలోని పెట్టుబడుల స్నేహపూర్వక పర్యావరణ వ్యవస్థకు అద్దం పడుతూ స్ఫూర్తినిస్తోంది.

- శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్ల సస్పెన్షన్

తిరుపతి(నేరవిభాగం)/నాయుడుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్య ధోరణి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు విచారణలో నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. నాయుడుపేట పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జి.చంద్రయ్య కొంతకాలంగా క్రమశిక్షణ లోపించి ప్రజలు, పిటిషనర్ల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. నాలుగు రోజుల కిందట ఈయన చిట్టమూరు మండలం కొత్తగుంట గ్రామంలోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలో యువకుడు పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఆ యువకుడు చిట్టమూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు చంద్రయ్యపై కేసు నమోదైంది. దీంతో చంద్రయ్యను ఎస్పీ సస్పెండ్ చేశారు. అలాగే, తిరుపతి సాయుధ దళం విభాగంలో విధులు నిర్వహిస్తున్న బి.రవికుమార్ క్రమశిక్షణ లోపించడం, ఇతర ఆరోపణలపై సస్పెండయ్యారు. పోలీసులు విధి నిర్వహణలో అలసత్వం, ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే సహించేది లేదని ఎస్పీ హెచ్చరించారు.



విన్యాసాలు అదరహో

మెజెస్టిక్ ఆర్మీ గుర్రంపై ఎన్‌సీసీ క్యాడెట్లు విన్యాసాలు చేశారు. గుర్రపుస్వారీతో అలరించారు. గుర్రాలతో ఫైర్‌జంప్, జంపింగ్ వంటి విన్యాసాలు అలరించాయి.

- వివరాలు 6లో -

600 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

సూళ్లూరుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో బుధవారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రత్యేక నిఘా విభాగం అధికారులు పట్టుకున్నారు. హోలిక్రాస్ కూడలి వద్ద ఓ లారీని తనిఖీ చేయగా 600కుపైగా రేషన్ బియ్యం బస్తాలు పట్టుబడ్డాయి. ఇందులో 560 బస్తాలు ఏపీకి, మిగిలినవి తమిళనాడు రేషన్ బియ్యంగా గుర్తించారు. తమిళనాడు రేషన్ బియ్యాన్ని ఆ రాష్ట్రంలోని ఏళావూరు నుంచి, ఆంధ్రా రేషన్ బియ్యాన్ని తడ నుంచి తరలిస్తున్నట్లు తెలిసింది. పట్టుబడిన లారీని స్థానిక పోలీసులకు అప్పగించగా, వారు సివిల్ సప్లయీస్ అధికారులకు సమాచారం ఇచ్చి గోదాముకు తరలించారు. డ్రైవర్ రఫీని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. లారీ యజమాని వేనాటి భాస్కర్ రెడ్డి, బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న మణికంఠ రెడ్డిపై కేసు నమోదు చేశారు.



పట్టుబడిన రేషన్ బియ్యం

ఆగని రేషన్ బియ్యం అక్రమ రవాణా

ప్రభుత్వం పేదల కోసం అందజేస్తున్న రేషన్ బియ్యం మాఫియాకు వరంగా మారింది. సూళ్లూరుపేట ప్రాంతం రాష్ట్ర సరిహద్దు కావడంతో ఇటు తమిళ బియ్యాన్ని కూడా తెచ్చి అక్రమ రవాణా చేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని డీలర్ల వద్ద నుంచి కొనుగోలు చేసి నెల్లూరు, కాకినాడ ప్రాంతాలకు తరలిస్తున్నారు. రోజుకు 5 నుంచి 8 లారీల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నా స్థానిక అధికారులు నెలకొకసారి ఒక వాహనాన్ని పట్టుకుని నామమాత్రంగా కేసులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో రెండు వారాల క్రితం బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎస్పీ ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఈ బృందం దాడులు చేస్తుండడంతో పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం పట్టుబడుతోంది.



అమ్మో.. చలి

వణికిస్తున్న చలి. అనారోగ్యాలనూ తీసుకొస్తోంది. ఈ వాతావరణానికి ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై

కథనం 6లో..

శ్రీకాళహస్తిలో 700 కిలోలు స్వాధీనం

శ్రీకాళహస్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 700కిలోల రేషన్ బియ్యంతో పాటు ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. చెన్నై రోడ్డులోని సాయిబాబా గుడి సమీపంలో 700 కిలోల రేషన్‌బియ్యాన్ని సహదేవ తన ఆటోలోకి ఎక్కించాడు. సమాచారం అందుకున్న సీఐ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆటో సహా రేషన్‌బియాన్ని స్వాధీనం చేసుకున్నారు. సహదేవను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. శ్రీకాళహస్తిలో రేషన్ బియ్యం అక్రమ రవాణా అధికమైంది. నిఘాపై పోలీసు ఉన్నతాధికారులు కూడా ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిసింది. రెండుసార్లు పక్కా సమాచారంతో రేషన్‌బియ్యాన్ని పట్టుకునేందుకు యత్నించారు. ఇంటి దొంగలు అక్రమార్కులకు సమాచారం లీక్ చేయడంతో ఆపరేషన్ విఫలమైనట్లు విశ్వసనీయ సమాచారం.



సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను కమ్మేసిన పొగమంచు

బలపడిన అల్పపీడనం

● నేడు, రేపు వానలు పడే అవకాశం

సూళ్లూరుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడింది. తమిళనాడు తీరానికి వాయవ్యదిశగా పయనిస్తుండడంతో గురు, శుక్రవారాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో తీరం వెంబడి చలిగాలుల తీవ్రత, తీరప్రాంతాల్లో అలల ఉధృతి అధికంగా ఉంటుంది. సూళ్లూరుపేటలో బుధవారం చలిగాలులుతో కూడిన చిరు జల్లులు పడ్డాయి. ఇక, పొగమంచు అధికంగా ఉంది. సూళ్లూరుపేటలో మధ్యాహ్నాం జాతీయ జాతీయ రహదారి, రైల్వే స్టేషన్‌ను పొగమంచు కమ్మేసింది. లైట్లు వేసుకొని వాహనదారులు రాకపోకలు సాగించాల్సి వచ్చింది.

■ అద్భుత క్షేత్రం తిరుమల



● విద్యాశంకర భారతీస్వామి

ఈ బ్రహ్మాండంలో అద్భుతమైన క్షేత్రం తిరుమల అని పుష్పగిరి శంకరాచార్య మఠాధిపతి విద్యాశంకర భారతీస్వామి అన్నారు. బుధవారం నైవేద్య విరామ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. 'రామరాజ్యం వచ్చి ప్రజలందరూ ఆనందంగా ఉండాలి. లోకాన్ని రక్షించాలి. జనాల్లో సద్బుద్ధి, ధార్మిక చింతన కలగాలి' అని స్వామిని కోరుకున్నానని చెప్పారు. స్వామి మహత్యం కనిపిస్తే తద్వారా హైందవ లోకంలో సుఖసంతోషాలు కలుగుతాయన్నారు. ఆలయం వద్ద భారతీస్వామికి అర్చకబృందం, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఇస్తికఫాల్ స్వాగతం పలికారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

■ పెద్దజీయర్‌స్వామికి పెద్ద మర్యాద



అమ్మవారి ఆలయం వద్ద పెద్దజీయార్‌స్వామి

పెరియ కోయిల్ కెల్వియప్పన్ శఠగోప రామానుజ పెద్దజీయర్‌స్వామికి బుధవారం తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం.. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో పెద్దమర్యాద జరిగింది. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం ఆయన అమ్మవారు, గోవిందరాజస్వామి మూలవర్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేసి సత్కరించారు. విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన భగవద్ రామానుజాచార్యుల కాలంలో తిరుమలలో పెద్దజీయర్ మఠం ఏర్పాటైంది. శ్రీవారి ఆలయం, పద్మావతి అమ్మవారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో కైంకర్యాలు, సేవలు, ఉత్సవాలను ఇప్పటికీ పెద్దజీయర్ పర్యవేక్షిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు.. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీఏఓ బాలాజీ, డిప్యూటీ ఈవోలు గోవిందరాజన్, శాంతి, నాగరత్నం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- తిరుచానూరు/తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి



సర్వదర్శనానికి

15 గంటలు

తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.59 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,598

తలనీలాలు సమర్పించిన వారు: 20,102



చలిగాలులు...

తుపాను వాతావరణంతో చలిగాలులు విపరీతంగా పెరిగిపోయాయి. సూర్యుడి జాడ పెద్దగా కనిపించడడం లేదు. కనిపించినా ఎండ పడడం లేదు.ఈ వాతావరణం కొత్త అనారోగ్యాలకు దారి తీస్తోంది. జలుబు, దగ్గు, జ్వరాలతో జనం ఆసుపత్రులకు బారులు తీరుతున్నారు. ఇప్పటికే కురిసిన వానలకు కుంటలన్నీ నిండిపోయి దోమల వృద్ధి కేంద్రాలుగా మారాయి. వృద్ధులు, పిల్లలు శ్వాసకోస సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇటువంటి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

పాటించాలి జాగ్రత్తలు

పిల్లలు జాగ్రత్త




చిన్న పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం వలన జలుబు, దగ్గు, జ్వరాలు బారిన శీతాకాలంలో ఎక్కువగా పడుతారు. జలుబు తీవ్రత వల్ల ఊపిరి పీల్చుకునేందుకు కూడా ఇబ్బంది పడతారు. నిద్ర పట్టదు. ఇలాంటి పరిస్థితుల్లో చిన్నారులను వీలైనంత వరకు బయట చల్లగాలులకు తీసుకు వెళ్లకూడదు. ఉన్ని, ఒదులుగా ఉండే దుస్తులను పిల్లలకు వేయడంతోపాటు చెవుల్లో గాలిపోకుండా తగు జాగ్రత్తలు పాటించాలి. ఆహారం, నీళ్లు, వెచ్చగా ఉండాలి. కూల్‌డ్రింక్స్‌కి, స్వీట్సుకి దూరం పెట్టాలి. నెలల బిడ్డల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించడం మేలు.

- డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల విభాగాధిపతి, రుయా



బాలింతలూ.. ఇవి పాటించండి!



చలికాలంలో బాలింతలు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. మంచు, చలిగాలులలోకి రాకూడదు. బయటకు రావలసివస్తే చెవుల్లోకి గాలిపోకుండా చూసుకోవాలి. వానకు తడిస్తే వెంటనే బట్టలు మార్చుకోవాలి. పోషక విలువలున్న ఆహారమే తీసుకోవాలి. అదీ వేడిగా ఉండేలా చూసుకోవాలి. కాన్పు తర్వాత కనీసం అయిదు నెలలపాటు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. వారు ఆరోగ్యంగా ఉంటేనే, వారి చిన్నారులూ ఆరోగ్యంగా ఉంటారు.

-డాక్టర్ పార్థసారథిరెడ్డి, తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్

వృద్ధుల కోసం రుయాలో ప్రత్యేక ఓపీ కౌంటర్లు



చలికాలం, వానా కాలం .. వృద్ధులే అనేక ఆరోగ్య సమస్యల బారిన పడతారు. రుయాలో వృద్ధుల కోసం ప్రత్యేక ఓపీ కేంద్రాలను అందుబాటులో ఉంచాం. ఓపీకి వస్తున్న వారిలో 50 ఏళ్ల పైబడిన వారే ఎక్కువ. జలుబు, దగ్గు, జ్వరాలు వంటి జబ్బులతో, శ్వాసకోస సమస్యలతోనే వీరు వస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే వృద్ధులకు సాయంగా ఇద్దరు అటెండర్లు ఉంటే మంచిది.

-డాక్టర్ రవిప్రభు, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్


రుయాస్పత్రిలో వైద్యం కోసం వృద్ధుల క్యూ

గ్రామీణులూ.. ఆరోగ్యం భద్రం





వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రత్తలు తగ్గి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటం వలన తగిన ఆరోగ్య జగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బందితోపాటు క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తూ వారి ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశాము. అవసరమైన చోట వెంటనే వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం.

-డాక్టర్ శ్రీహరి, జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి




ఆపత్కాలంలో ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు ఎనలేనివి




ఎన్‌సీసీ క్యాడెట్లతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి

● యువజన, క్రీడలశాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తిరుపతిరూరల్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆపత్కాల పరిస్థితులు ఎదురైనప్పుడు ఎన్‌సీసీ క్యాడెట్లు అందిస్తున్న సేవలు ఎనలేనివని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. యువతలో ఐక్యత, క్రమశిక్షణ పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. తిరుపతి నగరం ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని (2ఏ)ఆర్‌అండ్‌వీ రెజిమెంట్ ఎన్‌సీసీ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. విజయవాడ వరదల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ఎన్‌సీసీ విద్యార్థులు ఎంతో శ్రమించారని గుర్తుచేశారు. లెఫ్టినెంట్ కల్నల్ అనుప్, కల్నల్ సతీందర్ దహియా, వెటర్నరీఇన్‌చార్జి వీసీ డాక్టర్ జేవీరమణ, అధికారులు, ఎన్‌సీసీ యూనిట్ల ఆర్మీసిబ్బంది, సివిల్‌సిబ్బంది, క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 75మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మెజెస్టిక్ ఆర్మీ గుర్రంపై క్యాడెట్లు దూకడం.. ఆర్మీగుర్రాలు గుడ్‌లక్, రోమన్‌ఫామ్, గగన్, రాణిపై జంపింగ్ విన్యాసాలు.. ఒకచేత్తో ఈటెతో దూసుకుపోతూ మరోచేత్తో గుర్రాన్ని అదుపు చేస్తూ చేసిన టెంట్ పెగ్గింగ్ ప్రదర్శన.. ఫైర్‌జంప్ వంటి గుర్రపుస్వారీలను క్యాడెట్లు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

గూడూరు అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ నెల్లూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి బుధవారం తీర్పునిచ్చారు. గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. గూడూరు పట్టణం మాళవ్యానగర్ ప్రాంతానికి చెందిన జనార్దన్ చిల్లర దుకాణం నిర్వహించేవాడు. 2020 సెప్టెంబరులో పదకొండేళ్ల బాలిక సరుకులు కొనేందుకు దుకాణానికి రాగా అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో బుధవారం నెల్లూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి నిందితుడు జనార్దన్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని సీఐ తెలిపారు.

శ్రీవారి సేవలో క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్



తిరుమల, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): టీంఇండియా మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచి ఆలయంలోకి వెళ్లిన ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం చేయించి లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల వీరేంద్ర సెహ్వాగ్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు భక్తులు ఎగబడ్డారు.

47 రెవెన్యూ సభలు.. 699 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం 47 రెవెన్యూ గ్రామసభలను నిర్వహించగా, 699 అర్జీలు అందాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఇళ్ల స్థలాలు 55, అసైన్‌మెంట్ భూమిపై 53, క్యాస్ట్ వెరిఫికేషన్ 15, రీసర్వే 36, భూ ఆక్రమణలు 2, ఆర్‌వోఆర్‌పై 370, ఇతర విషయాలకు సంబంధించి 148 చొప్పున 699 అర్జీలు వచ్చాయన్నారు. అప్పటికప్పుడే 15 సమస్యలను పరిష్కరింగా.. మిగిలిన వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. ఇప్పటి వరకు 8,003 ఫిర్యాదులు అందినట్లు వివరించారు.

హత్యకేసులో ముగ్గురి అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి చెప్పారు. ఈ వివరాలను బుధవారం ఆయన శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరించారు. 'అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు చెందిన ఎలక్ట్రీషియన్ ప్రభాకర్ అదృశ్యంపై వన్‌టౌన్ సీఐ గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏర్పేడు మండలం పల్లంగొల్లపల్లికి చెందిన వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, హేమంత్‌కుమార్ ముగ్గురు కలిసి అతడిని హత్య చేసినట్లు విచారణలో గుర్తించారు. మంగళవారం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేయించారు. ఈ హత్యకేసులో నిందితులైన వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, హేమంత్‌కుమార్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండుకు పంపారు' అని డీఎస్పీ వివరించారు ఈ కేసును చేధించిన సీఐ గోపి, ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు హేమాద్రి, శంకర్, బాలచంద్ర, గంగాధర్, ప్రసాద్, రవిచంద్ర, సుందరంను ఆయన అభినందించారు.

అయ్యో.. తల్లి..!

● ఆస్పత్రికి తీసుకొచ్చి ఓపీ తెస్తానంటూ పరారైన సహాయకుడు

● రుయా ముందు దీనస్థితిలో వృద్ధురాలు



చేతి గాయానికి కట్టు. నడవలేని స్థితి. నోటి మాటా సరిగా రాలేదు. దీనస్థితిలో ఉన్న ఈ 70 ఏళ్ల వృద్ధురాలిని బుధవారం తిరుపతిలోని రుయాస్పత్రిలో వదిలేశారు. ఈమెను ఉదయం ఓ వ్యక్తి ఆటోలో రుయా అత్యవసర విభాగానికి తీసుకొచ్చాడు. అక్కడ వైద్య సిబ్బందికి ఆమె కుమారుడినని చెప్పాడు. ఓపీ తెమ్మంటే.. తెస్తానంటూ వెళ్లిన వాడు మళ్లీ రాలేదు. అత్యవసర విభాగంలోని వైద్యులు ఆమెను పరీక్షించగా.. చేతికి తీవ్ర గాయాలున్నట్లు గుర్తించారు. మందు రాసి కట్టుకట్టారు. ఆమె వెంట వచ్చిన వ్యక్తి కోసం సిబ్బంది విచారించారు. ఎవరూ లేకపోవడంతో మధ్యాహ్నం వరకు అత్యవసర విభాగంలో ఉంచి అనంతరం బయటకు పంపేశారు. నడవలేని స్థితిలో ఉన్న ఆ తల్లి.. అత్యవసర విభాగం ముందు ఓ చెట్టు కింద నిస్సహాయంగా కూలబడ్డారు. చలికి వణుకుతూ.. చిన్నపాటి చినుకులకు తడుస్తూ తనవారికోసం నిరీక్షిస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది, స్థానికులు నిన్ను ఎవరు తీసుకొచ్చారని అడిగితే.. నా కొడుకు అనే సమాధానం తప్ప ఇంకేమీ చెప్పలేదు. చెప్పేందుకూ ఇష్టపడలేదు. పదే పదే అడిగితే నన్ను ఇలాగే వదిలేయండి అంటూ చెమ్మగిల్లిన కన్నీళ్లతో ప్రాధేయపడ్డారామె. ఆమె పరిస్థితికి చలించిన సెక్యూరిటీ సిబ్బంది.. చిన్నపాటి దుప్పటి, నీరు, కొంచెం ఆహారం అందించారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

16.5 కిలోల గంజాయి స్వాధీనం

● ఐదుగురి అరెస్టు

భాకరాపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేసినట్లు భాకరాపేట సీఐ ఇమ్రాన్ బాషా తెలిపారు. ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో బస్టాండులో నిఘా పెట్టామన్నారు. తలకోన వైపు వెళ్లడానికి అనుమానాస్పదంగా తిరుగుతున్న తమిళనాడు రాష్ట్రం తిరుపూర్‌కు చెందిన జాఫర్ బిలాల్, తమిళసెల్వం, రాజాదొరై, కర్ణాటక రాష్ట్రం దావణగెరెకు చెందిన ఇస్మాయిల్, రఫీక్‌ను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. వారి నుంచి రూ.2.3 లక్షల విలువైన 16.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి ఐదుగురు నిందితులను రిమాండుకు పంపామన్నారు.

ఈవీఎం గోదాముల వద్ద పటిష్ఠ భద్రత


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈవీఎం గోదాముల వద్ద నిరంతరం పటిష్ఠ భద్రత ఉండేలా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్వర్ తెలిపారు. రేణిగుంట విమానాశ్రయ సమీపంలో ఈవీఎంలను భద్రపరచిన సెంట్రల్ వేర్ హౌసింగ్ గోదాములను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ రోజున మొరాయించిన 66 ఈవీఎంలను బెల్ కంపెనీకి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఈవీఎం గోదాముల ఇన్‌చార్జి సుధారాణి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, తహసీల్దారు సురేష్‌బాబు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి లా స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీ నిర్వహించే వివిధ లా కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 21వ తేదీ నుంచి స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. 27వ తేదీ దాకా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగనుంది. లాసెట్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులు. మూడు, ఐదేళ్ల డిగ్రీ కోర్సులతో పాటు రెండేళ్ల పీజీ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. వీటి భర్తీకి ఈ అడ్మిషన్లు చేపడుతున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో లా విభాగంలో సంప్రదించవచ్చునని పీఆర్వో శ్రీరజని తెలిపారు.

సత్ఫలితాలిస్తున్న 'మొబైల్ హంట్'

● రూ.87 లక్షలు విలువ చేసే 435 సెల్‌ఫోన్ల రికవరీ


రికవరీ చేసిన సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'మొబైల్ హంట్' సేవలు సత్ఫలితాలిస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.87 లక్షల విలువ చేసే 435 సెల్‌ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఇప్పటివరకు 11 విడతల్లో 3840 సెల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు ఇచ్చామని వివరించారు. ప్రస్తుతం 12వ విడతలో నెల రోజుల వ్యవధిలో 435 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు ఇచ్చామన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. సైబర్ క్రైం పోలీసుల పనితీరు వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఎవరైనా తమ మొబైల్ ఫోను పోగొట్టుకున్నా.. చోరీకి గురైనా వెంటనే మొబైల్ హంట్ నెంబరు 94906 17873 కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ చేయాలన్నారు. దీనికి వచ్చే లింకులో వివరాలు నమోదు చేసి సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అపరిచితులు విక్రయించే సెల్‌ఫోన్లను ఎవరూ కొనొద్దని సూచించారు. ప్రస్తుతం ఈ సెల్‌ఫోన్లను కేరళ, ఏపీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి రికవరీ చేశామని తెలిపారు. ఈ రికవరీలో ప్రతిభ చూపిన సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, ల్యాబ్ సీఐ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా పోలీసు వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజలకు సత్వరమే పోలీసు సేవలు అందుబాటులో ఉండేలా ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం 'జిల్లా పోలీసు వెబ్‌సైట్'ను ప్రారంభించారు. ఇకపై పారదర్శకత, జవాబుదారీతనం, పౌర స్నేహపూర్వక పోలీసింగ్ విధానం అలవాటు అవుతుందన్నారు. జిల్లా పోలీసులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, జాయింట్ డైరెక్టర్ ఐటీ కోర్ టీకే సుధాకర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు

తిరుపతి(ఆర్టీసీ), ఆంధ్రజ్యోతి : ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మసోత్సవాలు ఈనెల 20 నుంచి జనవరి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీపీటీవో జగదీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని డిపో మేనేజర్ల పరిధిలో 5,889 డోర్ డెలివరీలు చేయాల్సి ఉందని వెల్లడించారు.

టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే నివాళి



సుభాష్ చంద్ర మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల, మాజీ జడ్పీటీసీ రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి

డక్కిలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం వెంపటివారిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త శునకం సుభాష్ చంద్ర(32) బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఇటీవల పొలంలో పనిచేస్తుండగా స్పృహ తప్పి పడిపోవడంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి చెన్నైకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మళ్లీ తిరుపతికి తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వెంపటివారిపల్లి గ్రామానికి చేరుకొని సుభాష్ చంద్ర మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్ని విధాలా ఆదుకొంటామని భరోసా ఇచ్చారు. సుభాష్ చంద్ర పార్టీలో చురుగ్గా వ్యవహరించేవాడని, అలాంటి కార్యకర్తను కోల్పోవడం బాధాకరమన్నారు. ఇంకా మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, నాయకులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, డక్కిలి చంద్రారెడ్డి, వెంకటగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాజీ దొంతు శారద బాలకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, తిరుపతి పార్లమెంటు టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు పునుగోటి విశ్వనాధనాయుడు, వల్లభనేని మదుసూనరావు తదితరులు సుభాష్‌చంద్ర మృతదేహానికి నివాళులర్పించారు. అందరితో కలివిడిగా వుండే సుభాష్‌చంద్ర మృతి చెందాడని తెలియడంతో వెంకటగిరి, డక్కిలి ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో జనం తరలివచ్చి నివాళులర్పించారు.

వెట్టిచాకిరి నుంచి చిన్నారులకు విముక్తి



చైల్డ్‌కేర్ హోమ్ వద్ద చిన్నారులతో పోలీసులు, అధికారులు

వాకాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో బాల కార్మికులుగా వెట్టిచాకిరి చేస్తున్న నలుగురు చిన్నారులకు పోలీసులు బుధవారం విముక్తి కలిగించారు. ఎస్‌ఐ నాగబాబు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని పులింజరివారిపాళెంలో గత ఐదేళ్లుగా నివాసం ఉంటున్న విరగరాజు, పద్మ దంపతులు విడాకులు తీసుకొన్నారు. కుమారులు చెంచుకృష్ణ(15), రాఘవ (9), కుమార్తెలు పల్లవి (12), భూమిక(8)ను చదువు మాన్పించేసిన పద్మ ముట్టెంబాక, గొల్లపాళెం గ్రామాల్లో రొయ్యల గుంట వద్ద పనిలో పెట్టింది. తాను కూడా అక్కడే పనిచేసేది. ఈ నేపథ్యంలో మరో యజమాని వద్ద డబ్బు తీసుకొని పిల్లలను అతడి వద్ద వదిలేసేందుకు ప్రయత్నించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు పిల్లలను తీసుకెళ్లి ఐసీడీఎస్ సీపీవో సీహెచ్ సమతకు అప్పగించారు. అనంతరం చైల్డ్‌కేర్ హోమ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్లు బుజ్జమ్మ, కవిత, అట్రాసిటీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్ష



దీక్ష చేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

గూడూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్‌కు చెందిన కండక్టర్లు, డ్రైవర్ల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం 7వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు మాట్లాడుతూ డిపో మేనేజరు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్‌కు చెందిన కండక్టర్లు, డ్రైవర్లను అక్రమంగా సస్పెండ్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. సస్పెండ్ చేసిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర, ఎంఎస్ వాసు, రాము, శ్రీధర్, సుధాకర్, రాజు, శేషయ్య, రమణయ్య, గురవయ్య, సుధీర్, శ్రీనివాసులు, చంద్రయ్య, కేఆర్ దాసరి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం ఉద్యమాలే శరణ్యం



సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల హక్కుల కోసం ఉద్యమాలే శరణ్యమని పలువురు పెన్షనర్లు అన్నారు. కోటలోని షాదీమంజిల్‌లో బుధవారం ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ 20వ వార్షికోత్సవం జరిగింది. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భోగేశ్వరం మాట్లాడుతూ పెన్షనర్లకు దీర్ఘకాలికంగా రావాల్సిన పీఆర్సీ, డీఏ బకాయిలను తక్షణం చెల్లించాలన్నారు. పెన్షనర్లకు గతంలో లాగా 10, 15 శాతం అడిషనల్ క్వాంటం ఇవ్వాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతిని అందించాలని డిమాండ్ చేశారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జెన్ని ప్రసాద్, భాస్కర్‌రెడ్డి, రాఘవయ్య, జనార్ధనం, మౌలానా సాహెబ్, యామన రావు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవం

నాయుడుపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) 50వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి లోకేష్ టీఎంఆర్ విద్యాసంస్థల అధినేత తంబిరెడ్డి మనోహర్‌రెడ్డికి పండ్ల మొక్కలు అందించారు. కార్యక్రమంలో ప్రసాద్, నరేంద్ర, రామయ్య, సుధీర్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మనోహర్‌రెడ్డికి పండ్ల మొక్కలు అందజేస్తున్న లోకేష్, కిషోర్ తదితరులు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

వేనాడులో అయ్యప్పస్వామి దీపోత్సవం

తడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేనాడులో అయ్యప్పస్వామి దీపోత్సవం ఘనంగా జరిగింది. గ్రామంలోని రామ మందిరం వద్ద నుంచి అయ్యప్ప భక్తబృందం దీపోత్సవాన్ని ప్రారంభించింది. అయ్యప్పస్వామి చిత్రపటాన్ని గ్రామోత్సవ ప్రభలో కొలువుదీర్చి ఊరేగించారు. అయ్యప్ప భక్త బృందం భజనలు చేస్తుండగా మహిళలు దీపాలు చేతపట్టుకొని దీపోత్సవం నిర్వహించారు.



అయ్యప్పస్వామి గ్రామోత్సవం



దీపాలతో మహిళలు





పునబాక వద్ద గోతులమయంగా మారిన తారు రోడ్డు - చావాలి చెక్‌పోస్టు వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

దారుణంగా రహదారులు

అడుగడుగునా గుంతలతో వాహనదారుల ఇబ్బందులు

పెళ్లకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రహదారులు దారుణంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు పడి వర్షపు నీరు చేరడంతో జనం రోడ్లపై ప్రయాణం చేయలేక అవస్థలు పడుతున్నారు. చావాలి చెక్‌పోస్టు వద్ద 71వ జాతీయ రహదార నుంచి శిరసనంబేడు, చెంబేడు గ్రామాల మీదుగా శ్రీకాళహస్తికి వెళ్లే బీటీ రోడ్డు అడుగడునా గోతులుపడి కనీసం నడిచి వేళ్లేందుకు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అదేవిధంగా శిరసనంబేడు రాజుపాలెం నుంచి బంగారంపేట మీదుగా మోదుగులపాలెం వెళ్లే బీటీ రోడ్డు పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. గుర్రప్పతోట జాతీయ రహదారి నుంచి కప్పగుంటకండ్రిగ మీదుగా పాలచ్చూరుకు వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా తారు లేచిపోవడంతో అనేక గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంకా నీళ్లలోనే పంటలు

మళ్లీ ముసురుతో రైతుల ఆందోళన

నాయుడుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఇటీవల కురిసిన వర్షాలతో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. నాయుడుపేట మండలంలో రబీ సీజన్‌లో 7,900 ఎకరాల్లో రైతులు వరినాట్లు పూర్తి చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు దాదాపు 500 ఎకరాల వరి నీటమునిగి దెబ్బ తినిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా బుధవారం నుంచి ముసురుతో కూడిన వర్షం ప్రారంభం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



పుదూరులో వరదనీటిలో మునిగి వున్న వరిపైరు

చిన్నారులపై అకృత్యాలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు, వేదికపై సీఐలు బాబి, సంఘమేశ్వరరావు, ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సూచించారు. నాయుడుపేట ఐసీడీఎస్ కార్యాలయంలో నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామస్థాయిలో అంగన్‌వాడీలు చిన్నారులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. పిల్లలకు కొత్తవారు వచ్చి ఏమైనా చెబితే అంగన్‌వాడీలకు, తల్లిదండ్రులకు తెలియజేసేలా అవగాహన కల్పించాలన్నారు. తిరుపతి జిల్లా వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ రోజామణి మాట్లాడుతూ మహిళల పట్ల గృహహింస, చిన్నపిల్లల మీద జరుగుతున్న అకృత్యాలు, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి, అర్బన్, రూరల్ సీఐలు బాబి, సంఘమేశ్వరరావు, ఓజిలి ఎస్ఐ స్వప్న పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలతో ఎన్‌బీకేఆర్ డైరెక్టర్, జపాన్ సంస్థ ప్రతినిధులు

ఎన్‌బీకేఆర్‌తో జపాన్ సంస్థ ఒప్పందం

కోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల జపాన్‌కు చెందిన మెడిన్‌షా కార్పొరేషన్ సంస్థతో సాంకేతిక పరిజ్ఞాన నైపుణ్య బదలాయింపు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మెడిన్‌షా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కోయమాతో, డైరెక్టర్ టకాయికి, కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వినయ్‌సిమ్హా, నాయుడుపేట మండలం మేనకూరులోని కంపెనీ హెడ్ రమేష్‌చంద్రా సింగ్, హెచ్‌ఆర్ మేనేజింగ్ చైతన్య, కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈసందర్భంగా డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఒప్పందాల ద్వారా ప్రముఖ కోర్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, గత ఐదేళ్లలో 30మంది విద్యార్థులు మెడిన్‌షా సంస్థలో పనిచేస్తున్నట్లు తెలిపారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కోయమాతో మాట్లాడుతూ ఇక్కడ కళాశాల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం వల్ల తమ సంస్థకు ఎంతో ఉపయోగం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విక్రమ్‌కుమార్, ట్రిపుల్ ఈఈ విభాగాధిపతి ప్రభాకర్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు ఉన్నారు.

సుస్థిరాభివృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ అశోక్‌కుమార్, పక్కన ఏపీఎస్ ఐఆర్‌డీ రాష్ట్ర పరిశీలకులు రమేష్, ఎంపీడీవో సురేష్‌బాబు

నాయుడుపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 2030 నాటిని సాధించాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర పరిశీలకుడు రమేష్ అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పంచాయతీల అభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. గ్రామాల్లో అందరికీ విద్య, పౌష్టికాహారం, వైద్యం అందేలా చూడడంతో పాటు పేదరికాన్ని రూపుమాపాలన్నారు.

అన్ని సమస్యలకూ పరిష్కారం

పెళ్లకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో అందే ప్రతి అర్జీని పరిశీలించి అన్ని సమస్యలకూ పరిష్కారం చూపుతామని పెళ్లకూరు తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అనకవోలు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు భూ సమస్యలపై అర్జీలు అందించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, రాష్ట్ర తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్ నాయుడు తనకు సంబంధించిన భూముల్లో వరినాట్లు వేస్తుండగా అది చెరువు పొరంబోకు అంటూ కొంతమంది అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. తహసీల్దార్, డివిజన్, మండల సర్వేయర్లు సర్వేచేసి అది చెరువు పొరంబోకు కాదని, పట్టా భూమేని నివేదిక ఇచ్చారని తెలిపారు. అయితే రెండేళ్లుగా పంటలు వేయకుండా అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకుని నష్టపరిహారం అందించాలని కోరారు. అదేవిధంగా గ్రామానికి చెందిన సుమారు 17 ఎకరాల పట్టా భూమిని ఓ రైతు ఆక్రమించుకున్నారని యాళ్ల వెంకటాచలం నాయుడు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషీబాయి, వీఆర్వో వంశీకృష్ణ, మండల సర్వేయర్ పూజిత, లక్ష్మణ్, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మదన్ మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి(ఆంధ్రజ్యోతి) మండలంలోని అరిగేపల్లి, కాట్రగుంట గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పాసు పుస్తకాలు, 1బీ నమోదు కోసం 7, పక్కాగృహం, సాగుభూమికి హక్కులు కల్పించాలని ఒకటి చొప్పున అర్జీలు అందాయి. ఎంపీటీసీ రామయ్య ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి(ఆంధ్రజ్యోతి): మండంలోని దందవోలు గ్రామంలో బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది.

చిల్లకూరు(ఆంధ్రజ్యోతి) మండంలోని తొనుకుమాలలో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సాగు భూములకు పట్టాలు, ఇళ్ల స్థలాలు మంజూరు, సర్వే తదితర సమస్యలు పరిష్కరించాలని 23 వినతులు అందాయి. ఆర్ఐ పూర్ణ, నాయకులు కుమార్ యాదవ్, విజయ్ భాస్కర్, త్రివిక్రమ్ భూపతి పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు

ఓజిలి(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం సగుటూరులో తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామంలో నెలకొన్న సమస్యలను రైతులు తహసీల్దారు దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పలువురు రైతులు భూసమస్యలపై అర్జీలు ఇచ్చారు.

కోట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వంజివాకలో తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. భూ సమస్యలపై రైతులు వినతిపత్రాలు అందజేశారు. సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్ఐ మధులత పాల్గొన్నారు.

వాకాడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమూరు, యడగాటిపల్లి గ్రామాల్లో తహసీల్దారు రామయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ సందీప్, టీడీపీ నాయకులు కుంచం దయాకర్, పంత్రాంగం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఏడీఈ శేఖర్ బాబు, పక్కన ఏఈ మురళి, ప్రిన్సిపాల్ సుప్రియ

తడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు ఇంధన పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూళ్లూరుపేట ఏడీఈ శేఖర్ బాబు మాట్లాడుతూ ఇంధన పొదుపు వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ మురళి, ప్రిన్సిపాల్ సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతకు నేదురుమల్లి పరామర్శ

వెంకటగిరి టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని టీచర్స్ కాలనీ 9వ వార్డుకు చెందిన గంగిరెడ్డి కృష్ణారెడ్డి మామ ఆదినారాయణరెడ్డి మృతి చెందారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కల్యాణి, బాలయ్య, వహిదా, సుబ్బారావు, శ్రీనివాసులు, ప్రసాద్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, పేచిరాజ్, దశయ్య, నాగయ్య, సధారెడ్డి పాల్గొన్నారు.

గూడూరులో మోస్తరు వర్షం

గూడూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గూడూరులో బుధవారం ఉదయం నుంచి విడతలు విడతలుగా మోస్తరు వర్షం కురుస్తోంది. పట్టణంలోని పలు వీధుల్లో వర్షపు నీరు నిల్వ చేరింది. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే పాదాచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. అదే విధంగా చిల్లకూరులో ఉదయం నుంచి మోస్తరు వర్షం కురిసింది.

ఓజిలిలో జల్లులు

ఓజిలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ఉదయం నుంచి ముసురేసింది. మధ్యాహ్నం నుంచి జల్లులు పడ్డాయి. సాయంత్రం 4గంటలకే చీకట్లు అలుముకుని పొద్దుపోయిన వాతావరణం ఏర్పడింది. కాగా, పొగమంచు ఎల్లి పైర్లపై ప్రభావం చూపి తెగుళ్ల వ్యాపించే అవకాశం ఉందని రైతులు ఆందోళన పడుతున్నారు.

వేదవిజ్ఞాన వ్యాప్తికి టీటీడీ కృషి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేద విజ్ఞానాన్ని వ్యాప్తి చేసేందుకు టీటీడీ అవిరళ కృషి చేస్తోందని ఈవో శ్యామలరావు స్పష్టం చేశారు. వేద విశ్వవిద్యాలయ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. 2006లో వేద విశ్వవిద్యాలయాన్ని టీటీడీ ఏర్పాటు చేసిందని, అప్పటి నుంచి వేద విద్య బోధన, పరిశోధన, విస్తరణకు కృషి చేస్తోందని చెప్పారు. త్రికోణమితి, గణిత, ఖగోళశాస్త్ర విషయాలు వేదాల్లో ఉన్నాయని, ఈ విషయాలను సాధారణ ప్రజలకు తెలియజేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఐఐటీ సహకారంతో వేదసారాన్ని ఈ తరానికి అందించే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. అనంతరం వేదవిశ్వవిద్యాలయంలోని క్లాస్ రూములు, హాస్టళ్లు, రికార్డింగ్ స్టూడియో, తాళపత్ర గ్రంథాలను పరిశీలించారు. వేద వాఙ్మయానికి చెందిన శుక్ల యజుర్వేద వాజసనేయ ప్రాది సాఖ్యము, సేవది పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేద వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి, జేఈవో గౌతమి, రిజిస్ట్రార్ రాధాగోవిందత్రిపాఠి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుతో ఎన్నో ప్రయోజనాలు



సభ్యత్వ కార్డులు అందజేస్తున్న సంచి కృష్ణయ్య, ప్రసాద్‌నాయుడు, శేఖర్‌నాయుడు

పెళ్లకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. బుధవారం మండలంలోని అనకవోలు గ్రామంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు దామెర ప్రసాద్ నాయుడు, వట్టికుండల శేఖర్ నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, వెంకటాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

20న వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన వక్తృత్వ వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. తెలుగు, ఇంగ్లిషు భాషల్లో డిగ్రీస్థాయి విద్యార్థులకు ఈపోటీలు నిర్వహిస్తారు. విజేతలకు మొదటి స్థానానికి రూ.3 వేలు, రెండో స్థానానికి రూ.2 వేలు, మూడవ స్థానానికి రూ.1500 అందజేస్తారు. వివరాలకు 9393620006లో సంప్రదించాలని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రాజారెడ్డి కోరారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో మరమ్మతులు వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో మరమ్మతు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సాంఘిక సంక్షేమశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. పనులను నాణ్యతగా చేయాలని ఆదేశించారు.

20నుంచి ఎన్‌సీసీ శిక్షణ తరగతులు

కోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 20నుంచి 29వ తేదీ వరకు 10 ఆంధ్రా నావెల్ యూనిట్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో కంబైండ్ యానివల్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పలు జిల్లాల్లోని విద్యాసంస్థల నుంచి 450 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొంటారని తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్లలో మానసిక, శారీరక, సామాజిక అభివృద్ధి, దేశభక్తి, క్రమశిక్షణ, జాతీయ సమైక్యత, సోదరభావం, పోటీ తత్త్వం పెంచేందుకు శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ రాజేష్, మేనేజర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

21న జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ అథ్లెట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ మైదానంలో ఈ నెల 21వ తేదీన జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ అథ్లెట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాబర్ట్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 16 బాలబాలికలు 2 కిలోమీటర్లు, అండర్ 18 బాలురకు 6 కిలోమీటర్లు, బాలికలకు 4 కిలోమీటర్లు, అండర్ 20 బాలురకు 8 కిలోమీటర్లు, బాలికలకు 6 కిలోమీటర్లు, 20 ఏళ్ల పైబడిన పురుషులకు, స్త్రీలకు 10 కిలోమీటర్లు పరుగు పోటీలు జరుగుతాయని వివరించారు. రాణించిన క్రీడాకారులు ఈనెల 28న వైజాగ్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. మరిన్ని వివరాలకు 8686867079ను సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచే ఇంటర్ డిస్ట్రిక్ట్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో 27వ ఇంటర్ డిస్ట్రిక్ట్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్(2024-25) శుక్ర, శనివారాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు దానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. 13 జిల్లాల నుంచి 350మందికిపైగా బాలురు ఈ పోటీలలో పాల్గొంటున్నారు. ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గౌరీశంకర్, హెడ్ ఆఫ్ ఫార్మసీ జి.కృష్ణమూర్తినాయుడు, కాలేజీ పీఆర్వో కోటేశ్వరరావు పాల్గొన్నారు.